తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | ఆదివారం-26-అక్టోబర్-2025 | సంపుటి:3 | సంచిక:147 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in



## తెలంగాణలో గన్ కల్చర్ కాదు.. నేరాలను అణచివేసే కల్చర్ నడుస్తుంది

హైదరాబాద్, అక్టోబర్ 25, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నేరాలను అణచివేసే విషయంలో రాజీ పడేది లేదని, నేరగాళ్లు తమ పద్ధతులు మార్చుకోవాలని లేదా రాష్ట్రం వదిలి పారిపోవాలని ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి ప్రాంతాల్లో గన్ కల్చర్ (తుపాకీ సంస్కృతి) పెరిగిపోవడాన్ని, అలాగే గతంలో బీఆర్ఎస్ పాలనలో డ్రగ్స్ కల్చర్ పెంచి పోషించడాన్ని తాము చూశామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మిగతా 2లో..

## నిజామాబాద్ నుంచి కవిత 'జాగృతి జనం బాట' ప్రారంభం

### రాజకీయ జీవితానికి శ్రీకారం చుట్టిన జిల్లాకే తొలి ప్రాధాన్యత

### కార్యక్రమ ఉద్దేశ్యం, ప్రారంభ స్థలం ఎంపిక

### ప్రజల నుంచి అద్భుత స్వాగతం



నిజామాబాద్, అక్టోబర్ 25, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ శాసనమండలి సభ్యురాలు కవిత కల్వకుంట్ల ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడం కోసం రూపొందించిన తన కార్యక్రమం ''జాగృతి జనం బాట'' ను నిజామాబాద్ జిల్లా నుంచే ఉత్సాహంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం కృషి చేయడమే. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలతో తన అనుబంధాన్ని మరింత పెంచుకునే దిశగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. నిజామాబాద్ జిల్లా ప్రజల ఆదరాభిమానాలు, వారి పట్ల తనకున్న గౌరవం కారణంగానే ఈ కార్యక్రమానికి తొలి ప్రాధాన్యత ఇక్కడి నుంచే ఇవ్వడం సరైనదిగా భావించినట్లు కవిత తెలిపింది. ఈ కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకోవాలని ఆమె నిర్ణయించింది.

నిజామాబాద్ జిల్లాతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని ఈ సందర్భంగా కవిత స్పష్టంగా తెలియజేసింది.

మిగతా 2లో..

## రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ కోపరేటివ్ జిల్లా అధికారి

మంచిర్యాల, అక్టోబర్ 25, (తెలంగాణ ముచ్చట్లు)

మంచిర్యాల జిల్లాలో ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారుల దాడులు అవినీతి అధికారుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నాయి. శనివారం మంచిర్యాల జిల్లా సహకార శాఖ అధికారి రాథోడ్ బిక్కు నాయక్ పట్టణంలోని తన నివాసం వద్ద రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.

మిగతా 2లో..



## ఉద్యోగుల జీతాల చెల్లింపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

### ఆధార్ లింక్ చేయకపోతే జీతాలు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 25, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అక్టోబరు నెల జీతాల చెల్లింపుపై తెలంగాణ ప్రభుత్వం ఇవాళ (శనివారం) కీలక ఉత్తర్వులు విడుదల చేసింది. ఆధార్ వివరాలను లింక్ చేయని ఉద్యోగులకు జీతం చెల్లించరాదని ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది.

మిగతా 2లో..





## అభివృద్ధి ఆధారంగానే ఓట్లు అడుగుతున్నాం: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబర్ 25, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగానే తమ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''మేము చేస్తున్న అభివృద్ధిని చూపించే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజలను అడుగుతున్నాం'' అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

మిగతా 2లో..

## మహిళా శక్తి దిశగా మరో ముందడుగు

- సీతక్క చేతుల మీదుగా కొత్త నియామకాలు
- మహిళా శిశు సంక్షేమ శాఖలో 181 కొత్త సూపర్వైజర్ల నియామకం
- మంత్రి సీతక్క చేతుల మీదుగా నియామక పత్రాల అందజేత
- ఓపికగా 181 మంది అభ్యర్థులు అందరికీ నియామక పత్రాలు అందజేసిన మంత్రి సీతక్క
- రాజేంద్రనగర్‌లో ఘనంగా జరిగిన సూపర్వైజర్ల నియామక పత్రాల కార్యక్రమం



హైదరాబాద్, అక్టోబర్ 25, (తెలంగాణ ముచ్చట్లు)

రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీ ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 181 మంది గ్రేడ్ వన్ సూపర్వైజర్లకు నియామక పత్రాలను మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సీతక్క, మెన్ కార్పొరేషన్ చైర్పర్సన్ బండ్రు శోభారాణి తో కలిసి కొత్తగా నియమితులైన సూపర్వైజర్లను అభినందిస్తూ, ''వేల మందితో పోటీ పడి మీరు సాధించిన ఈ కొలువులు మీ కష్టానికి ప్రతిఫలం. మీ నిరీక్షలు ఫలించాయి, మీ ఉద్యోగ కలలను రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేర్చింది,'' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు.

మిగతా 2లో..



## మోసాన్ని మోసంతోనే జయించాలి

### జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం.. కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 25, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు. ''మోసాన్ని మోసంతోనే జయించాలి'' అని కేటీఆర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు తోట మహేష్ ముదిరాజ్, తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తోట మహేష్‌తో పాటు ఆయన అనుచరులకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

మిగతా 2లో..

## తెలంగాణకు ఐదు రోజుల పాటు భారీ వర్ష సూచన

### అక్టోబర్ 27 నుంచి వర్షాల తీవ్రత పెరుగుదల

### నేడు, రేపు తేలికపాటి వర్షాలు

### అక్టోబర్ 27 నుంచి భారీ వర్షాలు

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



2లో

## జూబ్లీహిల్స్‌లో వీళ్లకా మీరు ఓట్లు వేయాల్సింది

- కాంగ్రెస్ అభ్యర్థి ర్యాలీపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు
- మంత్రులకు మానవత్వం లేదు: ఆర్ఎస్పీ



హైదరాబాద్, అక్టోబర్ 25, (తెలంగాణ ముచ్చట్లు)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ర్యాలీపై తీవ్ర విమర్శలు చేశారు. వ్యభిచార గృహం నడిపించి అరెస్టయిన అఖిల్ యాదవ్ అనే వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థి ర్యాలీలో పాల్గొన్నాడని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ''కత్తులు, కటారులు పట్టుకొని డ్యాన్సులు చేస్తూ పోతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో వీళ్ళకా మీరు ఓట్లు వేయాల్సింది?'' అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మంత్రుల వ్యవహార శైలిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలో శ్రీవర్షిత అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుని చనిపోతే, ఆమె కుటుంబానికి పాడి కౌశిక్ రెడ్డి అండగా నిలిచారు. కానీ మాగంటి సునీత తన భర్తను గుర్తు చేసుకొని ఏడిస్తే, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు అవహేళన చేశారని, వారికి మానవత్వం లేదని ఆయన మండిపడ్డారు. గత రెండు ఏండ్లలో గురుకులాల్లో 110 మంది విద్యార్థులు చనిపోయినా, పాలనను గాలికి వదిలేసి మంత్రులు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కందిరీగల్లా తిరుగుతున్నారని విమర్శించారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణలో గన్ కల్చర్ కాదు.. నేరాలను అణచివేసే కల్చర్ నడుస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

అయితే, తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో నేరాలకు చోటు లేదని స్పష్టం చేశారు. చైన్ స్నాచింగ్ చేసేవారైనా, సెల్ ఫోన్స్ స్నాచింగ్ చేసేవారైనా, డ్రగ్స్ సరఫరా చేసేవారైనా సరే... తమ అలవాటు మానుకోవాలి, లేదంటే రాష్ట్రం వదిలి పారిపోవాలని ప్రభుత్వం హెచ్చరించింది. ''ఇక్కడ గన్ కల్చర్ కాదు... గన్ పడితే ఎవ్వడిదైనా గంటల్లో బెండు తీసే కల్చర్ మాత్రమే నడుస్తుంది. ఇదే రేవంత్ కల్చర్'' అని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రాణాలు సైతం పణంగా పెట్టి నేరాలను నిర్మూలిస్తున్న తెలంగాణ పోలీసులకు సెల్యూట్ అంటూ ప్రశంసలు కురిపించారు. నేరాలను అరికట్టి రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపేందుకు పోలీసులు చేస్తున్న కృషిని కొనియాడారు.

# రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ కోపరేటివ్ జిల్లా అధికారి

(మొదటి పేజీ తరువాయి)

ఏసీబీ ఆదిలాబాద్ ఏఎస్పీ మధు వెల్లడిరచిన వివరాల ప్రకారం, రాథోడ్ బిక్కు నాయక్ ఆసిఫాబాద్ సహకార జిల్లా ఇన్‌చార్జి అధికారిగా పని చేస్తున్న సమయంలో అక్కడ గత సంవత్సరం నవంబర్‌లో సస్పెండ్ అయిన ఒక ఉద్యోగికి సంబంధించి ఈ లంచం డిమాండ్ చేశారు. సదరు ఉద్యోగికి పెరిగిన వేతనాలు మంజూరు చేయడానికి, సస్పెన్షన్‌ను ఎత్తివేయడం కోసం బిక్కు నాయక్ మొత్తం రూ.7 లక్షలను లంచంగా డిమాండ్ చేశారు. ఈ మొత్తం డీల్‌లో భాగంగా, మొదటి విడతగా రూ. 2 లక్షలు తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు శనివారం ఉదయం ఆయనను పట్టుకున్నారు. అనంతరం మంచిర్యాల జిల్లా నస్పూర్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయం లోని జిల్లా సహకార అధికారి కార్యాలయంలో విచారణ చేపట్టారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా పనుల కోసం లంచం డిమాండ్ చేస్తే వెంటనే 1064 లేదా 9154388963 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఏసీబీ అధికారులు ప్రజలను కోరారు.

# అభివృద్ధి ఆధారంగానే ఓట్లు అడుగుతున్నాం: పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే తమ గెలుపుకు ప్రామాణికం అవుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించబోతోందని, ప్రజలు తమకు బ్రహ్మాండమైన మెజారిటీ ఇవ్వబోతున్నారని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. అభివృద్ధి అజెండాతోనే తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని ఆయన వెల్లడిరచారు.

# మోసాన్ని మోసంతోనే జయించాలి

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏవీ వాస్తవం కాలేదని, పేదల ఆశలు దెబ్బతిన్నాయని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజల కష్టాలు తగ్గాయని, ఉచిత మంచినీళ్లు, బస్తీ దవాఖానాలు, రూ.5 భోజనం, పింఛన్లు, రంజాన్ తోఫా వంటి అనేక పథకాలు అమలు చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడేమో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను బకాయిలతో ముంచేసిందని, వృద్ధులు, రైతులు, మహిళలు అందరిని మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ''మేం మోసపోయాం... కానీ ఇప్పుడు జూబ్లీహిల్స్ ప్రజలు మోసపోవద్దు. అందుకే మేం కూడా జూబ్లీహిల్స్‌కు వచ్చి ప్రచారం చేస్తామని గ్రామల నుంచి రైతులు, ప్రజలు చెబుతున్నారు'' అని ఆయన తెలిపారు. ప్రజల నిజమైన అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తేవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణలోని పేదవారు, కార్మికులు, రైతులు అందరూ జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారని, జైత్రయాత్ర ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. వచ్చే నెల 11న జరిగే పోలింగ్‌లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరుతూ, ''మీ ఓటు తెలంగాణ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. కేసీఆర్ పాలనలో సాధించిన అభివృద్ధిని కాపాడుకుందాం'' అని ఆయన పిలుపునిచ్చారు.

# జూబ్లీహిల్స్‌లో వీళ్లకా మీరు ఓట్లు వేయాల్సింది

(మొదటి పేజీ తరువాయి)

పొన్నం ప్రభాకర్ తన సొంత నియోజకవర్గం హుస్నాబాద్‌లో శ్రీవర్షిత చనిపోతే ఎందుకు అక్కడికి వెళ్ళలేదని ఆర్ఎస్పీ నిలదీశారు.

పిల్లలకు అన్యాయం జరిగినా పట్టదా?

మంత్రి సీతక్క శాఖ పరిధిలో ఉన్న సైదాబాద్ జువైనల్ హోంలో 10 మంది పిల్లలపై అక్కడి ప్రిన్సిపాల్ లైంగిక దాడి చేసినా, మంత్రి సీతక్క సంఘటన స్థలానికి వెళ్లలేదని, బాధితులను పరామర్శించలేదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. కానీ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓట్ల కోసం బోరబండ, షేక్ పేట్ ప్రాంతాల్లో తిరుగుతుందని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో పిల్లలకు అన్యాయం జరిగి ఎటుపోయినా పర్వాలేదు, ఓట్లు మాత్రమే కావాలి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు అని ఆర్ఎస్పీ తీవ్రంగా మండిపడ్డారు.

మైనారిటీ వాయిస్ అంటున్న ఒవైసీ బ్రదర్స్ వైఖరిపై ఆగ్రహం

మైనారిటీ నేతల వైఖరిపైనా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసదుద్దీన్, అక్బరుద్దీన్ సోదరులు మేము మైనారిటీ వాయిస్ అంటారు. కానీ ముస్లిం మైనారిటీ ఐఏఎస్ అధికారి రిజ్వీ మీద రేవంత్ రెడ్డి, జూపల్లి కృష్ణారెడ్డి నింద మోపుతున్నా నోరు తెరిచి మాట్లాడటం లేదని విమర్శించారు. జూపల్లి కృష్ణారావు రిజ్వీపై చర్య తీసుకోవాలని చీఫ్ సెక్రటరీకి లేఖ రాసినా, ఒవైసీ సోదరులు దీనిపై స్పందించకుండా పోయి రేవంత్ రెడ్డితో చెట్టపట్టాలు వేసుకొని తిరుగుతున్నారు అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఉద్యోగుల జీతాల చెల్లింపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

(మొదటి పేజీ తరువాయి)

పోర్టల్‌లో తమ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేయకపోతే అక్టోబరు జీతం నిలిపివేయబడుతుందని ప్రభుత్వం హెచ్చరించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పష్టం చేసిన ఈ నిబంధన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ వర్తిస్తుంది. అక్టోబరు 25వ తేదీ అర్ధరాత్రి లోపు ఆధార్ అప్‌డేట్ చేయడం తప్పనిసరి అని ప్రభుత్వం తేల్చిచెప్పింది. ట్రెజరీ, వర్క్స్ అకౌంట్స్, పే అండ్ అకౌంట్స్, ప్రభుత్వ శాఖలు, యూనివర్సిటీలు, కార్పొరేషన్లు, సొసైటీలు సహా అన్ని విభాగాలు ఈ ఆదేశాలను తప్పక పాటించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ లింక్ చేయని వారి అక్టోబరు జీతాలు నిలిపివేయాలని ఆదేశిస్తూ, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ఈ సర్క్యులర్‌పై సంతకం చేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించే అధికారులపై తీవ్రంగా వ్యవహరిస్తామని తెలంగాణ ప్రభుత్వం హెచ్చరిక జారీ చేసింది.

# నిజామాబాద్ నుంచి కవిత 'జాగృతి జనం బాట' ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

నిజామాబాద్ జిల్లా తనకు కేవలం మెట్టినిల్లు మాత్రమే కాదని, తన రాజకీయ జీవితానికి పునాది వేసిన ప్రాంతమని ఆమె ఉద్వేగంగా వెల్లడిరచింది. ఈ జిల్లా ప్రజలు చూపిన అభిమానం కారణంగానే ఎంపీగానూ, ఆ తర్వాత ఎమ్మెల్సీగానూ తనకు అవకాశం ఇచ్చి, ప్రజా సేవలో తన ప్రస్థానానికి శ్రీకారం చుట్టిన జిల్లా ఇదేనని ఆమె స్పష్టం చేసింది. అందుకే, ప్రజల మధ్యకు వెళ్లే ఈ ముఖ్యమైన కార్యక్రమాన్ని తనకు ఇంతటి రాజకీయ గుర్తింపు ఇచ్చిన జిల్లా నుంచే ప్రారంభించడం పట్ల ఆమె తన మనసులోని సంతోషాన్ని వ్యక్తపరిచింది.

తన కార్యక్రమానికి వచ్చిన విశేష స్పందన పట్ల కవిత మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపింది. ఈ పర్యటన సందర్భంగా నిజామాబాద్ జిల్లా ప్రజలు చూపిన ఉత్సాహం, అభిమానం తనను ఎంతగానో అక్కున చేర్చుకున్నాయని ఆమె పేర్కొంది. ఈ స్వాగతం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడానికి ఇది తనకు స్ఫూర్తినిచ్చిందని వివరించింది. ఈ స్వాగత కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న ఆడబిడ్డలకు, అన్నదమ్ములకు, మరియు ఘన స్వాగతం పలికిన యువతకు ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసింది. నిజామాబాద్ ప్రజల ఆప్యాయత తనను ఎప్పుడూ ముందుకు నడిపిస్తుందని ఆమె ప్రకటించింది. మొత్తంగా,



నిజామాబాద్ జిల్లా నుంచి ''జాగృతి జనం బాట'' ప్రారంభించడం ద్వారా కవిత కల్వకుంట్ల ప్రజలతో తమ అనుబంధాన్ని పునరుద్ధరించుకోవడానికి, జిల్లా సమస్యలపై దృష్టి పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతం ఇచ్చింది. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకునేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమం రానున్న రోజుల్లో మరింత విస్తృతం కానుంది. ఈ పర్యటన ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం కోసం మరింత పటిష్టంగా కృషి చేయడమే తన లక్ష్యమని ఈ ప్రకటన ద్వారా కవిత స్పష్టం చేసింది. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన సమాచారం ప్రభుత్వ విధానాల రూపకల్పనలో కీలకపాత్ర పోషిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది.

# మహిళా శక్తి దిశగా మరో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

అంగన్వాడీ వ్యవస్థ మహిళా శక్తికి ప్రతీకగా నిలుస్తోందని ఆమె అన్నారు. ''ఐసిడిఎస్ సేవలకు ఈ దేశంలో ఇందిరా గాంధీ గారు ప్రాణం పోశారు. మహిళలకు గౌరవం, చిన్నారులకు సంరక్షణ కలగాలని ఆమె ప్రారంభించిన అంగన్వాడీ సేవలు తెలంగాణ నేల నుంచే బీజం వేశాయి. 1970లో మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ సేవలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. అంగన్వాడీ హెల్పర్ నుంచి మహిళా శాఖ సెక్రటరీ వరకు ఈరోజు ఉన్న పదవులన్నీ ఇందిరా గాంధీ చలువే. ప్రతి మహిళ ఆమెకు రుణపడి ఉండాలి'' అని సీతక్క పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన సూపర్వైజర్లకు మార్గదర్శనం చేస్తూ సీతక్క, ''మీ వృత్తి ధర్మం ప్రజల ఆశలు, అవసరాలకు తగినట్టుగా ఉండాలి. ఒక్కో సూపర్వైజర్ కింద 25 అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యత ఉంటుంది. ఎక్కడా చిన్న లోపం లేకుండా ఆ కేంద్రాలను పర్యవేక్షించాలి. పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది,'' అని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలను పౌష్టికాహారానికి మాత్రమే పరిమితం చేయకుండా చిన్నారులకు ప్రాథమిక విద్యను అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. ''అమ్మ ఆప్యాయతకు నిలయాలుగా అంగన్వాడీ కేంద్రాలు మారుతున్నాయి. చిన్నారుల కోసం 57 రకాల ఆటవస్తువులు, యూనిఫాంలు అందిస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. మన దేశ భవిష్యత్తు అంగన్వాడీ కేంద్రాల్లోనే ఉంది. కాబట్టి ప్రతి సూపర్వైజర్ తన వృత్తి ధర్మాన్ని నిబద్ధతతో పాటించాలి,'' అని ఆమె సూచించారు. తెలంగాణలో పోషకాహార లోపాన్ని నిర్మూలించడంలో సూపర్వైజర్లు కీలక పాత్ర పోషించాలంటూ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ''అంగన్వాడీ చిన్నారుల పట్ల కేవలం సానుభూతి కాకుండా సహానుభూతి అవసరం. అంగన్వాడీ సిబ్బందికి ఎన్నో ప్రయోజనాలు కల్పిస్తున్నాం. త్వరలో 14 వేల అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల నియామకం చేపట్టబోతున్నాం'' అని తెలిపారు.

# తెలంగాణకు ఐదు రోజుల పాటు భారీ వర్ష సూచన

హైదరాబాద్, అక్టోబర్ 25, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని, కొన్ని చోట్ల భారీ వర్షాలు నమోదయ్యే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, అక్టోబర్ 25 (శనివారం) రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. అక్టోబర్ 26న ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నాయి. అక్టోబర్ 27 నుంచి వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. ముఖ్యంగా, అక్టోబర్ 28, 29 తేదీల్లో పెద్దపల్లి, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్‌తో పాటు పలు ఉమ్మడి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈదురు గాలులతో కూడిన వర్షాలు రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో నమోదవుతాయని పేర్కొంది.



అక్టోబర్ 30 తర్వాత వర్షాల తీవ్రత క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం, విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రైతులు, ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, పాత భవనాలకు దూరంగా ఉండాలని సూచించింది. జిల్లా యంత్రాంగాలు అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది.

# హుజూర్‌నగర్‌లో మెగా జాబ్ మేళా

## రేపు కూడా కొనసాగింపు, 279 కంపెనీల భాగస్వామ్యం

హైదరాబాద్, అక్టోబర్ 25, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే హుజూర్‌నగర్‌లో మెగా జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో ఉద్యోగాల కల్పన ప్రధానమని ఆయన అన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 279 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కంపెనీలు యువతకు ఉపాధి అవకాశాలను అందించాయి. యువత నుంచి ఊహించిన దాని కంటే ఎక్కువ సంఖ్యలో రిజిస్ట్రేషన్లు రావడంతో, ఈ జాబ్ మేళా అక్టోబర్ 26న



(రేపు) కూడా కొనసాగనుంది. గత 20 నెలలుగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనపైనే ప్రధానంగా దృష్టి సారించిందని, ఈ కాలంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో అనేక ఉద్యోగాలను సృష్టించిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడిరచారు. యువతకు ఉద్యోగాలు అందించడంలో తమ నిబద్ధతను ఈ జాబ్ మేళా నిరూపించిందని ఆయన పేర్కొన్నారు.

# హైదరాబాదులో రూ.4.9 కోట్ల బ్యాంకు ఫ్రాడ్ కేసు

హైదరాబాద్, అక్టోబర్ 25, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్‌లోని కార్పొరేషన్ బ్యాంకులో సుమారు రూ.4.9 కోట్ల మోసానికి సంబంధించిన కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. దాదాపు 20 ఏళ్ల సుదీర్ఘ విచారణ తర్వాత, బ్యాంకు మాజీ సీనియర్ మేనేజర్‌తో సహా ఏడుగురిని దోషులుగా నిర్ధారించి, వారికి జైలు శిక్ష విధించింది. ఈ విషయాన్ని సీబీఐ ఒక ప్రకటనలో తెలియజేసింది. కార్పొరేషన్ బ్యాంక్ బంజారాహిల్స్ బ్రాంచ్‌లో అప్పటి సీనియర్ మేనేజర్‌గా పనిచేసిన టి. చంద్రకాంత్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధించారు. ఈ కేసులో రుణాలు పొందిన ప్రైవేటు వ్యక్తులైన వి.ఎన్.ఎస్.సి. బోస్, వి. రాజశ్రీ, కొండా శేఖర్ రెడ్డి, ఎన్.వి.పి. నంద కిశోర్, హెచ్. రాజశేఖర్ రెడ్డిలకు ఏడాది చొప్పున కఠిన కారాగార శిక్ష, రూ.55,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. నిందితులందరూ కుమ్మక్కై, బ్యాంకింగ్ నిబంధనలను ఉల్లంఘించి, తమ అధికారిక హోదాలను దుర్వినియోగం చేస్తూ నకిలీ, కల్పిత పత్రాల ఆధారంగా రూ.4.9 కోట్ల విలువైన గృహ రుణాలను మంజూరు చేసి బ్యాంకును మోసం చేశారని విచారణలో తేలింది. ఈ ఆరోపణలపై సీబీఐ 2004 సెప్టెంబర్ 29న చంద్రకాంత్‌తో సహా 16 మందిపై కేసు నమోదు చేసింది. లోతైన విచారణ అనంతరం, 2007 మార్చి 30న చంద్రకాంత్‌తో పాటు మరో 11 మందిపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. హైదరాబాద్‌లోని సీబీఐ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి 2025 అక్టోబర్ 24న తుది తీర్పు వెలువరించి ఏడుగురిని దోషులుగా తేల్చారు.



# డ్రైనేజీ నిర్మించి సమస్యకు పరిష్కారం చూపాలని హైకోర్టు ఆదేశాలు

**కాప్రా, అక్టోబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా మున్సిపాలిటీ పరిధిలోని కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడ లో ఉన్న జనప్రియ సిల్వర్ క్రెస్ట్ వాసుల దీర్ఘకాలిక డ్రైనేజీ సమస్యకు హైకోర్టు పరిష్కారం చూపింది.గత మూడు సంవత్సరాలుగా సరిహద్దు లోని శివసాయి ఎన్‌క్లేవ్ నుండి జనప్రియ సిల్వర్ క్రెస్ట్ కాలనీ మీదుగా పారుతున్న డ్రైనేజీ నీటితో వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో పాటు వ్యాధులు వ్యాపిస్తున్నాయని కాలనీ వాసులు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతి నిధులను కోరినా స్పందన రాలేదు.ఈ నేపథ్యంలో హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్ సమస్యను సామాజిక బాధ్యతతో తీసుకుని, అధికారుల నిర్లక్ష్యంపై హైకోర్టులో కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం హైకోర్టు సంబంధిత అధికారులను రెండు వారాల్లోపు కొత్త డ్రైనేజీ నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించింది.హైకోర్టు తీర్పుతో దాదాపు 800 మంది వాసులకు ఊరట లభించింది. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యపై పోరాడుతున్న సొసైటీ సభ్యులు రజిత, విపణి, కిరణ్, వేణుగోపాల్ తదితరులు హైకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు.



# ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్స్ కోసం దేశవ్యాప్త ఉద్యమం

## ఎన్‌పీఆర్‌డీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్

**ఏ ఎస్ రావు నగర్, అక్టోబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** వికలాంగులకు ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ తెలిపారు.

కమలానగర్‌లోని ఎన్వీ భాస్కర్‌రావు భవన్‌లో "వికలాంగుల విద్యా-ఉపాధి, చట్టాల అమలు అనుభవాలు" అనే అంశంపై ఎన్‌పీఆర్‌డీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సు రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకట్ అధ్యక్షతన జరిగింది. మురళీధరన్ మాట్లాడుతూ, "ఒకే దేశం-ఒకే ఎన్నికల గురించి మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, ఒకే పెన్షన్ కోసం ఎందుకు మాట్లాడడం లేదో అర్థం కావడం లేదు. దేశవ్యాప్తంగా వికలాంగులు అనేక సమస్యలతో సతమతమవుతుంటే కేంద్రం ఎందుకు స్పందించడం లేదో ప్రజలకు చెప్పాలి," అని ప్రశ్నించారు.కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో వికలాంగులకు చట్టబద్ధంగా ఉన్న 25 శాతం అదనపు నిబంధనలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.ప్రభుత్వ-ప్రయివేట్ విద్యా సంస్థల్లో స్పెషల్ టీచర్లను నియమించాలని, విద్యా సంస్థల్లో 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. "2012 నుండి కేంద్రం కేవలం రూ.300 పెన్షన్ మాత్రమే ఇస్తోంది. ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని కనీసం రూ.5,000కి పెంచాలి," అని ఆయన కోరారు.కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, సుగమ్య భారత్ అభియాన్ అమలులో నిర్లక్ష్యాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య మాట్లాడుతూ, "వికలాంగుల కార్పొరేషన్ బలోపేతం కోసం తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించేందుకు 2023లో విడుదల చేసిన జీవో 34ను వెంటనే అమలు చేయాలి," అని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు కావొస్తున్నా పెన్షన్ పెంపు జరగకపోవడం విచారకరమని ఆయన అన్నారు." పెన్షన్ పెంచకపోగా, వాటిని రద్దు చేసే హక్కు ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారు?" అని ప్రశ్నించారు.

స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు చట్టం చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్ర అధ్యక్షురాలు టి. వరమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో స్పెషల్ టీచర్ల నియామకం అత్యవసరమని పేర్కొన్నారు.ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఆర్. వెంకటేష్, ఉపాధ్యక్షులు యశోద, కాషప్ప, ఉపేందర్, అరిఫా, మధుబాబు, సహాయ కార్యదర్శులు రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్రమోహన్, ప్రకాష్, దుర్గ, కవిత, భాగ్యలక్ష్మి, బాలయ్య, నర్సిములు, ప్రభుస్వామి, లలిత, షాయిన్ బేగం, రమేష్, మల్లేష్, యాదయ్య, నగేష్, వెంకన్న, రాజు, లక్ష్మీపతి, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే





**పెద్దమందడి,అక్టోబర్25(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి బలిజపల్లి గ్రామంలో శనివారం కురిసిన వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరిశీలించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన చివరి ధాన్యపు గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతుల కష్టానికి తగిన రీతిలో సహాయం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు





**కీసర, అక్టోబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు)** మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కీసరలో శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం కోసం ఉదారంగా విరాళాలు అందజేశారు. జిఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి రూ.2 లక్షలు, కీసర గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ రాయల శ్రావణ్ గుప్తా రూ.1.50 లక్షలు, పన్నాల రవికాంత్ రెడ్డి రూ.1 లక్ష విరాళంగా అందించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తుడుం యాదగిరి, ప్రధాన కార్యదర్శి కుంటోల్ల సత్యనారాయణ, సభ్యులు శీలం శ్రీనివాస్, చినింగని భూపాల్, చినింగని బాలరాజు, తుడుం శ్రీనివాస్, కుంటోల్ల ఆంజనేయులు,తుడుం ఆగమయ్య తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి





**పెద్దమందడి,అక్టోబర్25(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం పెద్దమందడి మండల పరిధిలోని జంగమయ్యపల్లి, ముందరి తండా, అల్వాల గ్రామాల్లో పలు మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

గ్రామానికి చెందిన శకుంతల ఇటీవల మృతి చెందడంతో ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన చెన్నమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను కలసి సంతాపం తెలిపారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. ఇక మాసమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ముందరి తాండా గ్రామానికి చెందిన గోపాల్, సాలమ్మల కుమార్తె జ్యోతి ఇటీవల మృతి చెందగా, ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యలను పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అల్వాల గ్రామానికి చెందిన షకీల్ పాషా మృతి చెందడంతో ఎమ్మెల్యే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. షకీల్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రమేష్‌గౌడ్, బాలరాజు, మల్లేష్, నరసింహ, యాదగిరి, సురేందర్ గౌడ్, వేణు గౌడ్, మన్యం బుచ్చన్న, శంకర్ నాయక్, అలాగే అల్వాల గ్రామ కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అరుంధతి విద్యాలయ పాఠశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు







**కీసర, అక్టోబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని అరుంధతి విద్యాలయ పాఠశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులతో పాటు ఎస్సైలు నాగరాజ్, లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది సైకిల్ ర్యాలీలో పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు.తరువాత కీసర ప్రధాన చౌరస్తాలోని తెలంగాణ స్తూపం వద్ద విద్యార్థులు క్యాండిల్ లైట్స్ వెలిగించి పోలీసు అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోలీసులు దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన వీరులను స్మరించుకోవాలని, వారి త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు నాగరాజ్, లక్ష్మణ్, సీనియర్ రిపోర్టర్ కర్రె గణేష్, సుమన్ బన్నీ, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యానాథస్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాలకు కడియం శ్రీహరికి ఆహ్వానం

**ధర్మసాగర్,అక్టోబర్25(తెలంగాణ ముచ్చట్లు):** ముప్పారం గ్రామంలోని చారిత్రాత్మక శ్రీ ముఖ్యానాథస్వామి దేవాలయంలో మహాశివుని పునఃప్రతిష్ఠ నిర్వహించి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ద్వితీయ వార్షికోత్సవాలను ఈ నెల 27, 28, 29 తేదీలలో నిర్వహించనున్నట్లు దేవస్థానం ట్రస్టు ప్రకటించింది. ఈ ఉత్సవాలకు స్టేషన్‌ఘనపూర్ శాసనసభ్యుడు, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిని ఆహ్వానించారు. పునఃప్రతిష్ఠాపన వ్యవస్థాపక అధ్యక్షుడు శివసాని ప్రవీణ్ రవీంద్ర ఆధ్వర్యంలో దేవస్థానం ప్రతినిధులు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రం



అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గుంటిపల్లి సంపత్‌కుమార్, సహాయ కార్యదర్శి మద్రిపల్లి రాజు, ప్రధాన సలహాదారులు సులుగూరి భిక్షపతి, గుళ్ళ కొమురయ్య, దారపు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ కట్టు - గ్రామస్థుల ఆగ్రహం!

**స్టేషన్ ఘనపూర్ అక్టోబర్ 25 తెలంగాణ ముచ్చట్లు**

జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలో నితానేదార్ పల్లి, గ్రామంలో వర్షం పడిందంటే అంతే కరెంట్ తీసేస్తూ ఫోన్ చేస్తే హెల్పర్ స్పందించని పరిస్థితి ఒకవేళ ఫోను ఎత్తి మాట్లాడిన ట్రిప్ అవుతుంది అని చెప్పి దాన్ని శాశ్వత పరిష్కారం చూపను వైనం కాస్త చినుకు పడితే చాలు — గ్రామం చీకట్లో మునిగిపోతోంది! వర్షం కురిసిందంటే కరెంట్ కట్ చేయడం నెమలిగొండ సబ్‌స్టేషన్ సిబ్బందికి అలవాటైపోయింది. తానేదారిపల్లి గ్రామ ప్రజలు ఈ నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. గతంలో సస్పెండ్ అయిన ఆపరేటర్ స్థానంలో వచ్చిన ప్రస్తుత ఆపరేటర్ కూడా అదే తీరులో వ్యవహరిస్తున్నాడని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "పదిగంటలకు తీసేసిన కరెంట్ మరుసటి రోజు ఉదయం పది, పదకొండు అయ్యే వరకు ఇవ్వడం లేదు. ఫోన్ చేస్తే ఎత్తడంలేదు. ట్రిప్ ఉందంటూ సాకులు చెబుతున్నారు" అని ప్రజలు మండిపడుతున్నారు. దాదాపు ఏడాది నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోందని, అధికారులు మాత్రం మౌనం వహించడం ప్రజల్లో ఆగ్రహాన్ని రేపుతోంది. "ప్రజల ఇబ్బందులు ఎవరికీ కనబడవా? చిన్న చినుకే కరెంట్ కట్ చేస్తే పెద్ద వానలో ఏం జరుగుతుంది?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. "ప్రజల పన్నుల మీద నడిచే శాఖలో ఇంత నిర్లక్ష్యం ఎందుకు?", "అధికారులు కుర్చీల్లో కూర్చొని ఫైళ్లను తిప్పుతారే గాని, గ్రామాల చీకటిని చూడరు!" అంటూ తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కరెంట్ శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా ఇక్కడ ఓవర్ లోడ్ కారణంతో గానే ఎందుకు అవుతుందో పూర్తి వివరాలు సేకరించి శాశ్వత పరిష్కారం చూపాలని లేకపోతే సామూహికంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## తెలుగు మాతృశ్రీ సేవా అవార్డుకు జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ ఎంపిక

- సంచలనాత్మక కథనాలకు కేరాఫ్...
- వెల్లువెత్తుతున్న అభినందనలు..



**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 25, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ జాతీయ కవి సమ్మేళనం తెలుగు మాతృశ్రీ సేవా అవార్డుకి ఎంపికయ్యారు. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ గత 12 సంవత్సరాలుగా వివిధ ఛానెల్స్, పత్రికల్లో, వివిధ హెదాల్లో జర్నలిస్ట్ గా పనిచేస్తున్నారు. అనేక అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, అదేవిధంగా ప్రజా సమస్యలను వెలికి తీస్తూ ప్రభుత్వాల ద్వారా వాటిని పరిష్కరించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఈవిధంగా సమాజానికి సేవచేస్తూ, సీనియర్ జర్నలిస్ట్ గా పనిచేస్తున్నందుకు అతని సేవలను గుర్తించి ఈ నెల అక్టోబర్ 26 ఆదివారం రోజున ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయం బస్ డిపో రోడ్డులో జరిగే జాతీయ కవి సమ్మేళనం కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ యు.వి.రత్నం, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయనకు ప్రధానం చేస్తున్నారు, ఈ కార్యక్రమంలో జాతీయ కవి సమ్మేళనం నిర్వహించబడును. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ "పీపుల్స్ డైరీ" దిన పత్రిక ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక సంచలనాత్మక కథనాలను ఆయన అందించారు. ఎక్కడ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నా ఎలాంటి శక్తుల ఒత్తిళ్లకు లొంగకుండా నిర్భయంగా వార్తలు అందించడంలో దిట్ట... జర్నలిజం వృత్తినే శ్వాసగా... నైతిక విలువలను పాటిస్తూ పేదల పక్షాన నిలువడం, అన్యాయాన్ని ఎదురించడం ఆయన లక్షణం.. అక్రమార్కుల బెదిరింపులకు వెరువకుండా, అక్రమ కేసులకు సైతం భయపడకుండా ఆయన ఎంచుకున్న దారిలో దూసుకెళ్తూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎందరో జర్నలిస్టులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఆయనకు అవార్డు రావడం పట్ల స్థానిక సీనియర్ జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలుపుతూ డాక్టర్ బండి కుమార్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.



## ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా యువ భారత్ శక్తి ఫౌండేషన్

**కరెంట్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి రూ.1 లక్ష ఆర్థిక సాయం అందజేత**

**సత్తుపల్లి, అక్టోబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** వేంసూరు మండలం దిద్దుపూడి గ్రామానికి చెందిన జుంజునూరి వెంకటేశ్వరరావు ఇటీవల కరెంట్ ప్రమాదంలో తీవ్ర గాయపడడంతో హైదరాబాదులోని సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్స కొనసాగించడం కష్టంగా మారిన విషయం తెలుసుకున్న యువ భారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు దాతల సహకారంతో రూ.1,00,000/ ఆర్థిక సహాయం అందించారు.

ఈ సహాయాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్వయంగా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలో ఒకరికి ఒకరు అండగా నిలిచే భావన ప్రతి వ్యక్తిలో పెరగాలని ఆకాంక్షించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో నైతిక విలువలు పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

వెంకటేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన దాతలకు, అలాగే ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపిన యువ భారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ భారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ వారికి జరిమానా..

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 25, తెలంగాణ ముచ్చట్లు;** ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడుపుతూ దొరికిన ఏడుగురికి శనివారం ఖమ్మం స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి బక్కెర నాగలక్ష్మి ముందు హాజరుపరిచినట్లు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. న్యాయమూర్తి ఏడుగురికి రెండు వేల చొప్పున జరిమానా విధించడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులు రెండు రోజుల పాటు ట్రాఫిక్ పోలీసులకు సహాయంగా నగరంలో ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 వరకు ట్రాఫిక్ విధులు నిర్వహిస్తూ కమ్యూనిటీ సేవ చేయాలని తీర్పు వెల్లడించారని తెలిపారు.



# అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి





- సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు
- చింతకాని తాసిల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ధర్నా

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 25, తెలంగాణ ముచ్చట్లు;**

సిపిఎం చింతకాని మండల కమిటీ ఆధ్వర్యంలో వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగని ఆదుకోవాలని రైతులకు నష్టపరిహారం అందించాలని తాసిల్దార్ కార్యాలయం ముందు శనివారం ధర్నా నిర్వహించడం జరిగింది . ఈ ధర్నాను ఉద్దేశించి మొదటి డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ ఈ సంవత్సరంలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైన రోజు నుండి అధిక వర్షాభావం వల్ల పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని పెసర పంట చేతికి రాకుండా నేలపాలు అయింది పత్తి ఎకరాకు రెండు మూడు క్వింటాలు మాత్రమే దిగుబడి వచ్చేసింది వరి ఎండు తెగులు వచ్చి పంట దెబ్బతిన్నది దిగుబడి వచ్చే అవకాశం లేదు రైతులు మరోపక్క అరకురా దిగుబడులతో వచ్చిన పంటకు గిట్టుబాటు ధర లేదు రైతులు అప్పుల పాలై ఉన్నారు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం ఉంది ఈరోజు సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తా ఉంది నష్టపోయిన రైతులకు ఎకరాకు 30000 రూపాయలు నష్టపరిహారం అందించాలా రైతులకు పంటల బీమా సౌకర్యం కల్పించి బీమా డబ్బులు చెల్లించాలి రైతు ప్రభుత్వం చెప్పుకుంటున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు రైతుల గురించి పంట నష్టం గురించి ఎక్కడ మాట్లాడలేదు దేశానికి అన్నం పెట్టే రైతన్నని పట్టించుకోకపోతే వాళ్ళ బాధల్లో వాళ్ళ కష్టాల్లో ప్రభుత్వం పాలుపంచుకోపోతే ఈ ప్రభుత్వానికి మనుగడ ఉండదు ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అధికారులతో సర్వే చేయించి నష్టపోయిన రైతాంగని ఆదుకొని నష్టపరిహారాన్ని రైతులకు ఇవ్వకపోతే రాబోయే కాలంలో ఈ ప్రభుత్వానికి రైతాంగం తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు ఈ ధర్నాలో సిపిఎం మండల కార్యదర్శి రాచబంటి రాము మండల నాయకులు వత్సవాయి జానకి రాములు నాన్నకి కృష్ణమూర్తి కాటబత్తిన వీరబాబు కొత్తపల్లి వెంకటేశ్వర్లు మడిపల్లి కిరణ్ బాబు పులి యజ్ఞ నారాయణ గడ్డం కోటేశ్వరరావు ఆళ్ల మాధవరావు నున్న రామకోటయ్య ఖందరమైన కొండలు రావు రౌతు అప్పారావు నక్కన పైన శాంతారావు తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**మల్లాపూర్, అక్టోబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ మెట్రో వాటర్ అండ్ సెవరేజ్ బోర్డు నిధులతో ఈస్ట్ అన్నపూర్ణ కాలనీలో రూ.8 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులు, రూ.4.10 లక్షల వ్యయంతో తాగునీటి పైపులైన్ పనులు చేపట్టనున్నారు. అలాగే న్యూ భవానీ నగర్ కాలనీలో రూ.20.50 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, కాలనీ వాసులు దుల్మిట్ట దయాకర్ రెడ్డి, బాను చందర్ రెడ్డి, కటర్ల శేఖర్, ధర్మారెడ్డి, మెయిన్ పాషా, శ్రీనివాస్ రావు, రాఘవచారి, ఇస్మాయిల్, ప్రదీప్, ముబీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక నాయకులు బోదాసు లక్ష్మీ నారాయణ, తండా వాసుగౌడ్, కుంటి కృష్ణ, తిగుళ్ల శ్రీనివాస్ గౌడ్, అల్లాడి కృష్ణ యాదవ్, ఉస్మాన్, శ్రీశైలం, మహేందర్ తదితరులు పాల్గొని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు మేలు చేకూర్చాలని కోరారు.

## మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పుట్టినరోజు సందర్భంగా ఘనంగా రక్తదాన శిబిరం





**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 25, తెలంగాణ ముచ్చట్లు:** జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు 55వ పుట్టినరోజు సందర్భంగా చింతకాని మండల పార్టీ, యువజన విభాగం ఆధ్వర్యంలో నాగులవంచ గ్రామంలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా యువకులు అధిక సంఖ్యలో పాల్గొని 55 మంది రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంత రావు, రైతు సంఘం నాయకులు మంకెన రమేష్, గడ్డం శ్రీను,కొండలు,కొల్లి బాబు, ఛాట్ల సురేష్, చాట్ల భగవాన్, యువజన విభాగం నాయకులు కొపూరి నవీన్, అయ్యోరీ సాయి,మీరా సాహెబ్, పర్శగని ఏడుకొండలు,నాదెండ్ల వెంకటేష్, శీలం నాగేశ్వరావు తదితర చింతకాని మండల బిఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరైనారు.

## ప్రజా జీవినానికి విఘాతం కలిగించే వారిపై పిడి యాట్లు పెడతాం





### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 25, తెలంగాణ ముచ్చట్లు;** రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై నిత్యం నిఘా పెట్టాలని,గత మూడేండ్లలో తరచూ భూదందాలు, దౌర్జన్యాలు, సెటిల్మెంట్లు, దాడులతో పాటు గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలతో భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రజా జీవనానికి విఘాతం కలిగించే వారిపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు తరలించాలన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నేర ప్రవృత్తి కలిగిన రౌడీషీటర్ల కదలికలపై పోలీస్ అధికారులు దృష్టి పెట్టారు. వారి ఇండ్లకు వెళ్లి ఆరా తీశారు. వివరాలు సేకరించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నేరస్తులు సత్ప్రవర్తన దిశగా అడుగులు వేయాలని సూచించారు.

ప్రతిఒక్కరిపై సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా ఏర్పాటు చేశామని,ఏ చిన్న తప్పు చేసినా పట్టేస్తామన్నారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని వదిలి సమాజంలో మంచి ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. నేరస్తులు తొందరపాటుతనంతో చేసిన నేరాలు వారి కుటుంబ సభ్యులను ఇబ్బందుల్లో పడేశాయని గుర్తు చేశారు. గతాన్ని మరిచిపోయి.. మారిన మనసుతో ముందడుగు వేయాలని కోరారు. సత్ప్రవర్తన కలిగి ఉన్న నేరస్థుల పై షీట్ ఎత్తివేసే అవకాశం ఉంటుందని కౌన్సిలింగ్ ఇచ్చారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
ఆదివారం-26- అక్టోబర్ 2025




## సాయిబాబా,హనుమాన్ ఆలయాలకు ఫ్యాన్లు అందజేసిన భక్తులు

**చిల్పూర్,అక్టోబర్25(తెలంగాణ ముచ్చట్లు):** జనగాం జిల్లా చిల్పూర్ మండలంలోని వంగాలపల్లి గ్రామంలో ఉన్న శ్రీ సాయిబాబా-హనుమాన్ ఆలయానికి భక్తి భావంతో మూడు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. సుమారు రూ.6,000 విలువ గల ఈ ఫ్యాన్లను సాయి సిరి ఎంటర్ప్రైజెస్ కదుకాయ శ్యాం, హరీష్ ఎంటర్ప్రైజెస్ హరీష్, ధనలక్ష్మి ఎంటర్ప్రైజెస్ రమణ రెడ్డి కలిసి ఆలయ కమిటీకి సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అరుకాల మోహన్, కదుకాయ రమేష్, నూనె యాదగిరి, అరకాల దామోదర్, అరకాల ఎల్లయ్య దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.





## షర్దా సిన్హా గీతాలతో ఛఠ్ ఉత్సవానికి ప్రత్యేక శోభ - ప్రధాని మోదీ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఛఠ్ మహాపర్వ శుభారంభం సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన లిలి'బీహార్ కోకిల'లిలిగా ప్రసిద్ధి చెందిన దివంగత లోక్ గాయని షర్దా సిన్హాను గుర్తుచేసుకున్నారు. కేవలం ఒక రోజు ముందు తనకు బేగుసరాయ్ వెళ్లే అవకాశం లభించిందని, ఆ బేగుసరాయ్ జిల్లాతో షర్దా సిన్హాకు ఆత్మీయ అనుబంధం ఉందని మోదీ పేర్కొన్నారు. ఛఠ్ పండుగకు తన గీతాల ద్వారా షర్దా సిన్హా మరియు ఇతర లోక్ కళాకారులు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక భావాన్ని జోడిరచారని ప్రధానమంత్రి కొనియాడారు. సాంప్రదాయకంగా పాటలు, రాగాలలో భక్తి మరియు ప్రకృతి యొక్క అద్భుతమైన భావం నిండి ఉంటుందని మోదీ అన్నారు. ఛఠ్ పండుగలో భక్తి, ఆరాధనతో పాటు ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి ఉందని ప్రధాని పేర్కొన్నారు.
ఈ మహాపర్వ దినాన, షర్దా సిన్హా మరియు బీహార్‌లోని ఇతర ప్రముఖ లోక్ కళాకారులు ఆలపించిన ఛఠ్ పాటలను తాను పంచుకుంటున్నానని ప్రధానమంత్రి మోదీ తెలిపారు. ఈ గీతాలను విన్న ప్రతి ఒక్కరూ మంత్రముగ్ధులవుతారని, ఛఠ్ మైయ్య అనుగ్రహం లభిస్తుందని ఆయన ఆకాంక్షించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రధాని మోదీ ఛఠ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూనే, ఈ గీతాలను విని, ఈ పండుగ ఆనందాన్ని, భక్తి భావాన్ని మరింత పెంచుకోవాలని కోరారు. ఛఠ్ మహాపర్వం సందర్భంగా సూర్య భగవానుడిని మరియు ఛఠీ మాతను ప్రార్థిస్తున్నానంటూ, ఈ పండుగ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలను, శ్రేయస్సును నింపుతుందని మోదీ ఆకాంక్షించారు.

## బస్సుల భద్రతపై సోనూ సూద్ ఆందోళన

- **మాన్యువల్ ఎమర్జెన్సీ డోర్ తప్పనిసరి చేయాలి**
- **ఎలక్ట్రానిక్ డోర్ల వైఫల్యంపై ఆందోళన**



బాలీవుడ్ నటుడు, సామాజిక కార్యకర్త సోనూ సూద్ ప్రయాణికుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మరియు రవాణా మంత్రిత్వ శాఖకు కీలక విజ్ఞప్తి చేశారు. బస్సుల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు మాన్యువల్ ఎమర్జెన్సీ డోర్ తప్పనిసరి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్ ఎమర్జెన్సీ డోర్‌లు ప్రమాద సమయాల్లో తరచుగా పనిచేయకుండా పోయే అవకాశం ఉందని సోనూ సూద్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అందుకే, ప్రయాణికుల భద్రత కోసం ప్రతి లగ్జరీ బస్సులో ఎలక్ట్రానిక్ డోర్‌తో పాటు మాన్యువల్ ఎమర్జెన్సీ డోర్ కచ్చితంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ నిబంధనను చట్టం ద్వారా తప్పనిసరి చేయాలని సూచించారు. భద్రతా నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు, బస్సు ఆపరేటర్లు తమ పర్మిట్‌లను పునరుద్ధరించుకోవడానికి ముందు మాన్యువల్ ఎమర్జెన్సీ డోర్ ఉన్నట్లు ఫోటోలతో సహా రుజువును అప్‌లోడ్ చేయాలని సోనూ సూద్ కోరారు. ఈ ఆదేశాలను పాటించడానికి ఒక నెల గడువు ఇవ్వాలని సూచించారు. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదు అని మంత్రి నితిన్ గడ్కరీ మరియు రవాణా శాఖకు ఆయన విజ్ఞప్తి చేశారు. తక్షణమే ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు.






# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను కేటీఆర్ బిఆర్ఎస్ నేతలతో ప్రత్యేక సమావేశం

**హైదరాబాద్, అక్టోబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను దృష్టిలో పెట్టుకొని, తెలంగాణ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.సమావేశంలో కేటీఆర్ పార్టీ నాయకులందరినీ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. "హైదరాబాద్ నగర ప్రజలు బిఆర్ఎస్ పట్ల చూపిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. గత ప్రభుత్వ సేవలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు గుర్తు చేసి, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను వివరించాలి" అని ఆయన సూచించారు.కేటీఆర్ నగరంలో బిఆర్ఎస్ చేపట్టిన రహదారి నిర్వహణ, ఫ్లైఓవర్లు, 20వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకం, పారిశుధ్య కార్యక్రమాలు, నీటి సరఫరా వంటి అభివృద్ధి కార్యాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ విఫలమైన పాలన, 22 నెలల లో 'హైడ్రా విధ్వంసం' వంటి సంఘటనలను ఎక్కడికక్కడ ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు. కేటీఆర్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బిఆర్ఎస్ విజయం సాధిస్తే, రాబోయే జీహెంసీ ఎన్నికల్లో ఏకపక్షంగా గెలుపుని నిర్ధారిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో కూడా ఉప ఎన్నికలు తప్పవని, రాష్ట్రవ్యాప్తంగా మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రాబోతున్నాయని తెలిపారు.బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ కోసం ప్రజలకు ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి ఓటు సేకరించాలని కేటీఆర్ సూచించారు.






## మహిళలకు అండగా షీ టీమ్స్ రాచకొండ సీపీ జి. సుధీర్ బాబు

**15 రోజుల్లో 171 వేదింపుల నివారణ**

**హైదరాబాద్, అక్టోబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** రాచకొండ కమిషనర్ జి. సుధీర్ బాబు (ఐపీఎస్) మాట్లాడుతూ బాలికలను మహిళలను వేధించే మగపురుషు లను షీ టీమ్స్ వదలదన్నారు. వారు బస్టాండ్లు, రైల్వే, మెట్రో స్టేషన్లు, స్కూల్లు, కాలేజీలు, బహిరంగ ప్రదేశాల్లో డెకాయ్ ఆపరేషన్లలో పాల్గొని, నిందితులను సాక్ష్యాలతో పట్టుకొని కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు.ప్రధాన చర్యలు:
మైనర్ బాలికను వేధించిన మేనత్త భర్త అరెస్ట్.తప్పుడు ఆరోపణలు వేసి మహిళను వేధించిన నిందితులు అదుపులోకి తీసుకోబడ్డారు.ప్రేమ మోసం చేసి శారీరకంగా వేధించిన వ్యక్తి అరెస్ట్.బస్ స్టాండ్‌లో న్యూసెన్స్ చేస్తున్న యువకుడు అదుపులోకి తీసుకోబడిన ఘటన.
అవగాహన కార్యక్రమాలు:
ఈ నెల 1-15 తేదీలలో 79 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, 13,501 మందికి మహిళా హక్కులు, చట్టాలు, జాగ్రత్తలపై వివరాలు అందజేయడం జరిగింది.మెట్రోరైల్ డెకాయ్ ఆపరేషన్లు:మహిళా కంపార్ట్‌మెంట్ లో ప్రయాణిస్తున్న 7 పురుషులను పట్టుకుని, మెట్రో స్టేషన్ అధికారుల ద్వారా ఫైన్ విధించబడింది.

**మహిళలు ఫిర్యాదు చేయడానికినంబర్లు:రాచకొండ వాట్సాప్: 8712662111,బోనగిరి: 8712662598, చౌటుప్పల్: 8712662599, ఇబ్రహీం పట్టణం: 8712662600, కుషాయిగూడ: 8712662601,ఎల్‌బి నగర్: 8712662602, మహేశ్వరం: 8712665299, మల్కాజిగిరి: 8712662603,వనస్థలిపురం:8712662604, యాదగిరి: 8712665300.సీపీ సూచన: మహిళలు, యువతులు వేదింపులకు గురైనప్పుడు భయపడకుండా షీ టీమ్స్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో: డీ.సి.పి ,టి. ఉషారాణి, ఏసిపి పల్లె వెంకటేశ్వర్లు, ఇన్స్పెక్టర్ జి. అంజయ్య, అడ్మిన్ ఎస్ఐ రాజు మరియు షీ టీమ్స్ సిబ్బంది.**

# పండుగల వేళ రైల్వేల్లో నరకయాతన

- **ఎన్డీఏ సర్కార్‌పై రాహుల్ గాంధీ విమర్శలు**
- **రైళ్లలో సామర్థ్యానికి మించి ప్రయాణికులు**




దేశంలో పండుగల సీజన్ మొదలైన నేపథ్యంలో, బీహార్‌కు వెళ్లే రైళ్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులపై కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పండుగల వేళ ఇంటికి వెళ్లాలనే ఆరాటం ఇప్పుడు పోరాటంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ''ప్రస్తుతం పండుగల మాసం దీపావళి, భాయ్‌దూజ్, ఛఠ్. బీహార్‌లో ఈ పండుగలు కేవలం విశ్వాసం మాత్రమే కాదు, ఇంటికి తిరిగి రావాలనే ఆరాటం. కానీ, ఈ ఆరాటం ఇప్పుడు ఒక పోరాటంగా మారింది'' అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. బీహార్ వెళ్లే రైళ్లు కిక్కిరిసిపోయాయని, టికెట్ దొరకడం అసాధ్యంగా మారిందని, ప్రయాణం అమానవీయంగా తయారైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ''ఎన్నో రైళ్లలో సామర్థ్యం కంటే 200% వరకు ప్రయాణికులు ఉన్నారు. ప్రజలు రైలు తలుపులు, పైకప్పుల వరకు వేలాడుతున్నారు'' అని రాహుల్ గాంధీ విమర్శించారు.

'డబుల్ ఇంజిన్' సర్కార్‌పై విమర్శలు

కేంద్రంలోని 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వ (కేంద్ర, రాష్ట్రంలో బీజేపీ లేదా మిత్రపక్షాల పాలన) వాదనలు డొల్ల అని రాహుల్ గాంధీ విమర్శించారు. ''12,000 ప్రత్యేక రైళ్లు ఏమయ్యాయి? ప్రతి సంవత్సరం పరిస్థితి ఎందుకు మరింత దిగజారుతోంది? బీహార్ ప్రజలు ప్రతి సంవత్సరం ఇలాంటి అవమానకరమైన పరిస్థితుల్లో ఎందుకు ఇంటికి తిరిగి రావాల్సి వస్తోంది?'' అని ఆయన ప్రశ్నించారు.
రాష్ట్రంలో ఉపాధి మరియు గౌరవప్రదమైన జీవనం లభించి ఉంటే, వారు వేల కిలోమీటర్లు దూరంగా వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. ఈ దయనీయ పరిస్థితి కేవలం ప్రయాణికుల దుస్థితి మాత్రమే కాదని, ఎన్డీఏ మోసపూరిత విధానాలకు, నిజాయితీ లేని వైఖరికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. సురక్షితమైన, గౌరవప్రదమైన ప్రయాణం అనేది హక్కు, అది ఎవరి దయాదాక్షిణ్యం కాదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# గుంతే ప్రాణం తీసింది..

- **ట్రక్కు కింద నలిగి యువతి మృతి**

సిలికాన్ వ్యాలీగా పేరుగాంచిన బెంగళూరు నగరంలో రోడ్ల దుస్థితి మరో యువతి ప్రాణాన్ని బలిగొంది. రోడ్డుపై ఉన్న ఓ గుంతను తప్పించే ప్రయత్నంలో బైక్‌పై నుంచి కింద పడిన 26 ఏళ్ల ప్రియాంకను, వెనుక నుంచి వచ్చిన ట్రక్కు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ హృదయ విదారక ఘటన నగర శివార్లలోని నెలమంగళ సమీపంలో జరిగింది.

సోదరుడికి తప్పిన ప్రమాదం

ప్రియాంక తన సోదరుడితో కలిసి బైక్‌పై ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మార్గమధ్యంలో ఉన్న గుంతను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పింది. దీంతో సోదరులిద్దరూ కిందపడిపోయారు. హెల్మెట్ ధరించడం వల్ల స్వల్ప గాయాలతో సోదరుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడు.



నిర్లక్ష్యం కారణంగానే మరణం

అయితే, ప్రియాంక రోడ్డుకు అవతలి వైపు పడటంతో, అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న ట్రక్కు ఆమెపై నుంచి దూసుకెళ్లింది. తలకి తీవ్ర గాయాలు కావడంతో ఆమె సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచింది. రోడ్డు నిర్వహణ విషయంలో పౌర అధికారులు ప్రదర్శిస్తున్న తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే తరచుగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని నగరవాసులు, సామాజిక కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భద్రతా లోపాలు: ప్రభుత్వం నిర్లక్ష్యం

భద్రతా పరిపాలన లోపాలను ప్రభుత్వం వెంటనే చూడాలి

ప్రజల అవగాహన: అత్యవసర శిక్షణ అవసరం

భవిష్యత్తు చర్యలు: కఠిన నియంత్రణ అవసరం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ...

గత 10 సంవత్సరాల్లో 15కి పైగా బస్ ఫైర్ ఘటనలు



**హైదరాబాద్, అక్టోబరు 25(తెలంగాణ ముచ్చట్లు)**

కర్నూల్ జిల్లాలో నిన్న మధ్యాహ్నం ఘోరమైన బస్ ఫైర్ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాణాంతక ఈ ఘటనలో అనేక మంది గాయపడ్డారు, కొందరు మరణించారు. ఈ సంఘటన రాష్ట్రంలో ప్రజల్లో తీవ్రమైన భయభ్రాంతిని సృష్టించింది. సాధారణ ప్రజలు, ప్రయాణికులు ఇప్పుడు బస్సులు, ఇతర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలలో సురక్షితంగా ప్రయాణించగలమా అనే ప్రశ్నను ఎదుర్కొంటున్నారు. ఈ ప్రమాదం ప్రస్తావిస్తున్న ముఖ్య సమస్య ఏంటంటే, భద్రతా ప్రమాణాలు, వాహన పరిశీలనలు, మరియు డ్రైవర్ల శిక్షణలో ప్రభుత్వ పర్యవేక్షణ లోపాలు ఉండడం.

ప్రస్తుతం, బస్ ఫైర్ ప్రమాదాలపై సమర్థవంతమైన నియంత్రణలు, పద్ధతులు ఉండకపోవడం మరోసారి చూపుతోంది. ప్రభుత్వ అధికారులు, రవాణా శాఖలు, మరియు సంబంధిత ఇన్స్పెక్షన్ విభాగాలు వాహన భద్రతను నిర్ధారించడంలో విఫలమయ్యారు. ప్రతి బస్సులో ఫైర్ ఎక్స్టింగ్విషర్‌లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు, ఫైర్ అలారం వ్యవస్థలు ఉండడం తప్పనిసరి. అయితే, ఈ పరిస్థితులు చాలాసార్లు అమలు కాలేదు. ప్రభుత్వం ముందుగా తీసుకోవాల్సిన చర్యలను వదిలేసి, ఘోర ప్రమాదాలకు తావు ఇచ్చింది.

ప్రజల అవగాహన లోపం

ఫైర్ సేఫ్టీ విషయంలో ప్రజల అవగాహన కూడా తక్కువగా ఉంది. బస్సుల్లో ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఎలా స్పందించాలో ప్రజలకు సరైన సమాచారం ఇవ్వడం లేదు. ఎగ్జిట్ మార్గాలు, ఫైర్ అలారం ఉపయోగం, అత్యవసర సమయంలో ఎలా బయటకు రావాలో తెలపడం చాలా తక్కువ. పాఠశాలలు, కాలేజీలు, మరియు స్థానిక సంఘాలు ఈ అవగాహన కార్యక్రమాల్లో ఇంకా పూర్వప్రభావం చూపించలేకపోవడం, పరిస్థితిని మరింత భయంకరంగా మార్చింది.

గత ప్రమాదాల విశ్లేషణ

గత 10 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 15కి పైగా బస్ ఫైర్ ఘటనలు నమోదయ్యాయి. కొన్ని ఘటనల్లో పెద్ద సంఖ్యలో ప్రాణాలు నష్టపోయాయి. ఈ ఘటనలను పరిశీలిస్తే, భద్రతా ప్రమాణాలను పాటించని వాహన సంస్థలు, సంబంధిత అధికారులు, మరియు సాంకేతిక ప్రమాణాలను అమలు చేయని వ్యక్తులు ఘోర ఫలితాలకు కారణమయ్యారని స్పష్టంగా తెలుస్తోంది. ఈ ఘటనలపై సీరియస్ చర్యలు తీసుకోవడం ఇప్పటివరకు చౌకగా మిగిలిపోయింది.

ప్రభుత్వం తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు

ప్రతి బస్సులో ఫైర్ సేఫ్టీ సరంజామా, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు, డ్రైవర్ మరియు కండక్టర్లకు ఫైర్ సేఫ్టీ శిక్షణ, వాహనాల పీరియడిక్ ఇన్స్పెక్షన్ లాంటివి తప్పనిసరిగా అమలు చేయాలి. ప్రభుత్వ అధికారులు ఈ నియమాలను పాటించడం, పరిశీలనలో లోపం లేకుండా చూడడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలన్నీ నివారించవచ్చు.

భవిష్యత్తు కృషి మరియు నిర్లక్ష్యం నివారణ

కర్నూల్ బస్ ఫైర్ ఘటన ప్రభుత్వం మరియు ప్రజల ముందు ఒక హెచ్చరికగా నిలుస్తుంది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా, ప్రభుత్వమే ముందుగా చర్యలు తీసుకోవాలి. ప్రజలు, వాహన కంపెనీలు, మరియు సంబంధిత అధికారులు సకాలంలో భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ఇలాంటి ఘోర ఘటనలను నివారించవచ్చు. భద్రతా చర్యలు, కఠిన పునరావృతం, ప్రజల అవగాహన ద్వారా మాత్రమే భవిష్యత్తులో రోడ్లను మరింత సురక్షితం చేయవచ్చు.

### వాహన సంస్థలపై కఠిన చర్యలు

**వాహన కంపెనీలు భద్రతా ప్రమాణాలను పాటించకపోతే, వాటిపై కఠినమైన జరిమానాలు, లైసెన్స్ రద్దు, మరియు సంబంధిత డ్రైవర్లపై శిక్ష విధించడం తప్పనిసరి. ఇలాంటి చర్యలలో నిర్లక్ష్యం చూపినప్పుడు, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి ప్రమాదాలు సంభవించడానికి అవకాశం ఉంది. ప్రజల్లో ఫైర్ సేఫ్టీ అవగాహన పెంచడం అత్యవసరం. రోడ్లపై ర్యాలీలు, వాహన డ్రైవర్ మరియు ప్రయాణికుల శిక్షణ, సోషల్ మీడియా ప్రచారాలు ద్వారా అవగాహన సృష్టించాలి. ప్రతి వ్యక్తి ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఎలా స్పందించాలో తెలుసుకోవాలి.**





# పోలీసు అమరవీరులకు నివాళిగా బైక్ ర్యాలీ

**సత్తుపల్లి, అక్టోబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** పోలీసు జెండా దినోత్సవాల లో భాగంగా బి గంగారం 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్ ఆధ్వర్యంలో శనివారం గంగారం గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బెటాలియన్ నుండి బయలుదేరిన ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగి ప్రజల్లో పోలీసు అమరవీరుల త్యాగాలపై అవగాహన కల్పించారు. బెటాలియన్ సిబ్బంది, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బెటాలియన్ అదనపు కమాండెంట్ ఏ. అంజయ్య మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థ సామాజిక భద్రత, ప్రజల ప్రశాంత జీవనానికి అండగా నిలుస్తుందని తెలిపారు.

కార్యక్రమంలో బెటాలియన్ సహాయ కమాండెంట్లు ఎస్. శ్రీధర్ రాజా, యస్.డి. రంగారెడ్డి, ఇతర అధికారులు, కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు.



## సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో

# రెనాల్ట్ నిస్సాన్ క్యాంపస్ నియామకాలు

### 40మందికి ఉద్యోగాలు

**సత్తుపల్లి, అక్టోబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** బి. గంగారం గ్రామం, సాయిస్ఫూర్తి స్వయంప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ, ట్రిపుల్ ఈ, మెకానికల్ విభాగాల నాల్గో సంవత్సరం విద్యార్థుల కోసం ప్రముఖ పారిశ్రామిక సంస్థ రెనాల్ట్ నిస్సాన్ చెన్నై ఆధ్వర్యంలో జాతీయస్థాయి క్యాంపస్ నియామకాలు నిర్వహించబడినాయి.

ఈ ఇంటర్వ్యూలకు కళాశాల నుంచి మొత్తం 92 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల శిక్షణ–ఉద్యోగ వ్యవహారాల అధికారి డాక్టర్ డి.వి. కృష్ణారెడ్డి తెలిపారు. కంపెనీ తరఫున ఎం. ప్రకాష్ నియామక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రారంభ పరిచయ సమావేశం, రాత పరీక్ష, సాంకేతిక ముఖాముఖి, మౌఖిక చర్చ వంటి దశలతో ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. ఇందులో గ్రాడ్యుయేట్ శిక్షణా ఇంజనీర్ మరియు ఉత్పత్తి శిక్షణా ఇంజనీర్ హోదాల్లో మొత్తం 40 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఈసీఈ విభాగం: 33 మంది, ట్రిపుల్ ఈ విభాగం: 6 మంది, మెకానికల్ విభాగం: 1 ఉన్నట్లు కళాశాల కార్యదర్శి మరియు ప్రతినిధి దాసరి ప్రభాకర్ రెడ్డి వివరించారు.

తమ ప్రతిభ, సాంకేతిక అవగాహన, పరిశ్రమ సంబంధిత నైపుణ్యాల ఆధారంగా విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. చదువు పూర్తైన వెంటనే ఉద్యోగంలో చేరాల్సి ఉంటుందని తెలిపారు. విధులు ప్రధానంగా చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉంటాయి. వార్షిక వేతనం రూ. 3.5 లక్షలుగా నిర్ణయించబడింది.

ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యావేత్త బండి పార్థసారథి రెడ్డి మరియు ట్రస్ట్ సభ్యురాలు బండి అన్విత ఆన్లైన్ ద్వారా విద్యార్థులను అభినందించారు.

కళాశాల ప్రిన్సిపాల్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పరిశ్రమ సంబంధిత ప్రాజెక్టులు, శిక్షణలు, పరిశ్రమ సందర్శనలు కల్పించేందుకు సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలియజేశారు. కళాశాల ఉప ప్రిన్సిపాల్ మరియు కంప్యూటర్ శాస్త్ర విభాగాధిపతి షేక్ యాకూబ్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పాముల శేఖర్ బాబు, ట్రిపుల్ ఈ విభాగాధిపతి కె. రామకృష్ణ ప్రసాద్, మెకానికల్ విభాగాధిపతి వి. వెంకటరామి రెడ్డి తదితర విభాగాధిపతులు పాల్గొన్నారు. ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను కళాశాల అధ్యాపక వర్గం అభినందించింది.







# ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో న్యాయ చైతన్య సదస్సు

**సత్తుపల్లి, అక్టోబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి జడ్జి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, కోర్టుల విధులు, కోర్టుల రకాల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు ఎలా ఉంటాయి, ఏ కేసు ఏ కోర్టులో విచారణ జరగుతుందో వివరించారు. ప్రాంసరి నోటు రాత, అది ఎంతకాలం చెల్లుబాటు అవుతుంది, ప్రాంసరి నోటు సంబంధించి తలెత్తే వివాదాల్లో కోర్టు ప్రక్రియ ఎలా ఉంటుందో స్పష్టం చేశారు. బెయిల్ బుల్, నాన్ బెయిల్ బుల్ కేసుల తేడాలు కూడా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చెప్పినట్లు తెలియజేశారు. అలాగే బాలికలు సమాజంలో జాగ్రత్తలు పాటించే అంశంపై చైతన్యం కల్పించారు. విద్య మనిషిని రక్షించే శక్తి, న్యాయ అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం అని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. భాగ్యలక్ష్మి జడ్జి వివరాలు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం జడ్జిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో లలితమ్మ, ప్రమీల, కల్పన, సత్యనారాయణ, కృష్ణవేణి, రామారావు, రాణి, శ్వేత, సమ్మక్క, శిరోమణి, వెంకటేశ్వరరావు, సౌజన్య పాల్గొన్నారు.


# ఏ సమయంలో ఆహారం తినాలి ?



మనం ఆరోగ్యంగా ఉండాలంటే సరైన సమయంలో ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. మనం ఏ సమయంలో ఎలాంటి ఆహారం తీసుకున్నా దాని ప్రభావం మన ఆరోగ్యం పై ఎక్కువగా కనిపిస్తుంది.ముఖ్యంగా సమ్మర్ సీజన్‌లో ఆహారం విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ సీజన్‌లో డీహైడ్రేషన్, జీర్ణక్రియకు సంబంధించిన సమస్యలు ఉండవచ్చు. అందుకే ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. వేసవిలో ప్రజలు తమ భోజన సమయాల విషయంలో చాలా అజాగ్రత్తగా ఉంటారని వైద్యనిపుణులు చెబుతున్నారు. చాలా మంది ఏ సమయంలోనైనా ఆకలిగా అనిపించినప్పుడు ఆహారం తీసుకుంటారు. అలాంటప్పుడు ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ, వారు అనేక రకాల జీర్ణ సమస్యలను ఎదుర్కోవడం ప్రారంభిస్తారు. ఏ సమయంలో తినాలి.. వేసవిలో మీరు అల్పాహారం, భోజనం, రాత్రి భోజనాల సమయాన్ని నిర్ణయించుకోవాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. అన్నింటిలో మొదటిది, మీరు ఉదయం నిద్రలేచిన 2 గంటలలోపు అల్పాహారం తీసుకోవాలి. దీని అర్థం మీరు 1011 గంటల వరకు అల్పాహారం తీసుకోవాలని కూడా కాదు. మీరు మీ అల్పాహారాన్ని 8 గంటలకు ముగించడానికి ప్రయత్నించాలి.

తేడా ఏమిటి.. నిపుణుల అభిప్రాయం ప్రకారం అల్పాహారం, భోజనం తర్వాత 5 గంటల విరామం అవసరం. కాబట్టి మీరు మధ్యానం 1 గంటలోపు భోజనం చేయాలి. మధ్యాహ్న భోజనం ఆలస్యం చేయడం వల్ల శరీరంలో గ్లూకోజ్ లోపం ఏర్పడుతుంది. ఇది అలసట, బలహీనతను కలిగిస్తుంది. కాబట్టి సరైన సమయానికి భోజనం చేయడం చాలా ముఖ్యం. రాత్రి భోజనం, నిద్ర సమయం మధ్య 3 గంటల గ్యాప్ ఉండాలి. కాబట్టి మీరు మీ రాత్రి భోజనం 8 గంటలకు చేయాలి. రాత్రి భోజనం చేశాక అర్థరాత్రి వరకు మెలకువగా ఉండకూడదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం వేసవి కాలంలో వీలైనంత ఎక్కువగా హైడ్రేటెడ్‌గా ఉండండి. దీని వల్ల వేసవిలో శరీరంలో నీటి కొరత ఉండదు. దీనివల్ల వాంతులు, వికారం సమస్య ఉండదు. అలాగే హైడ్రేటింగ్ పండ్లను మీ ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు అంటున్నారు.

# శరీరంలో హార్మోన్ల అసమతుల్యత సంభవిస్తుందా..



శరీరం అన్ని విధులలో హార్మోన్లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. జీవితం, జీవనశైలిని మెరుగుపరచడంలో హార్మోన్లు చాలా సహాయపడతాయి. కానీ బిజీగా, తీవ్రమైన జీవితంలో, మానసిక లేదా భావోద్వేగ సమస్యల కారణంగా, హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది.అంతే కాకుండా పరిస్థితులు, పర్యావరణం కూడా హార్మోన్లను ప్రభావితం చేస్తుంది. ఇది మానసిక మార్పుల వంటి సమస్యలకు దారితీస్తుంది. ఆధునిక శాస్త్రం శరీరంలో వివిధ విధులను నిర్వర్తించే 50 కంటే ఎక్కువ రకాల హార్మోన్లను గుర్తించింది. ఈ హార్మోన్ల స్థాయి ఎక్కువగా పెరిగినప్పుడు లేదా తగ్గినప్పుడు, హార్మోన్ల అసమతుల్యత లక్షణాలు కనిపించడం ప్రారంభిస్తాయి. ఫిట్‌నెస్ గురు, సంపూర్ణ నిపుణుడు మిక్కీ మెహతా హార్మోన్ల అసమతుల్యత దశలు, దాని లక్షణాలు, తలెత్తే సమస్యను తగ్గించే మార్గాలను తెలియజేస్తున్నారు. కౌమారదశ, గర్భధారణ, పెరిమెనోపాజ్ లేదా మెనోపాజ్ సమయంలో హార్మోన్ల అసమతుల్యత సర్వసాధారణం. కాలక్రమేణా ఈ అసమతుల్యత అనేక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. హార్మోన్ల అసమతుల్యత లక్షణాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. యుక్తవయస్సులో సాధారణంగా శరీరంలో హార్మోన్ల అసమతుల్యత కారణంగా ముఖం పై మొటిమలు ఏర్పడతాయి. ఈ సమస్యకు ఇది మొదటి సంకేతం. అలాగే చిరాకు, మూడ్ బ్యాడ్, ఏకాగ్రత లేకపోవడం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి. హార్మోన్ల అసమతుల్యతను నిర్లక్ష్యం చేయడం వల్ల మహిళల్లో పాలిసిస్టిక్ ఓవరీ సింట్రోమ్ డిజార్డర్, ఇతర వ్యాధులకు దారితీయవచ్చు. పెరిమెనోపాజ్ లేదా మెనోపాజ్ సమయంలో మహిళలు వేగంగా బరువు తగ్గడం లేదా పెరగడం వంటి సమస్యను ఎదుర్కొంటారు. దీనితో పాటు నెమ్మదిగా గుండె కొట్టుకోవడం, అలసట, అధిక చెమట, చేతులు జలదరింపు, థైరాయిడ్ గ్రంధి పనిచేయకపోవడం, కొలెస్ట్రాల్ పెరుగుదల వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఈ లక్షణాలతో పాటు, ఆందోళన, నిరాశ కూడా సంభవిస్తాయి. శరీరంలో హార్మోన్ల అసమతుల్యత కారణంగా ప్రతి వ్యక్తి వివిధ సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ అసమతుల్యత జీవక్రియ కార్యకలాపాలను ప్రభావితం చేస్తుంది. హైపోథైరాయిడిజమ్‌కు కారణమవుతుంది. అంతే కాకుండా మధుమేహం కూడా రావచ్చు. శరీరంలోని జీవక్రియ రేటు మందగించడం, కొవ్వు సులభంగా శక్తిగా మారకపోవడం వల్ల శరీరంలో హార్మోన్ల అసమతుల్యత కారణంగా ఊబకాయం ఏర్పడుతుంది. దీని వల్ల కొవ్వు పేరుకుపోయి బరువు పెరుగుతుంది. ఇది ఊబకాయం సమస్యను సృష్టిస్తుంది.

# పాదాల్లో వాపు కనిపిస్తుందా...



పాదాల వాపు అనేది ఒక సాధారణ సమస్య. కానీ అది అప్పుడప్పుడు సంభవిస్తే మాత్రమే. కానీ ఇది ప్రతిరోజూ లేదా తరచుగా జరగడం అనేక రకాల సమస్యల లక్షణం కావచ్చు. సాధారణ సందర్భాల్లో రక్త ప్రసరణ సరిగ్గా జరగకపోవడం వల్ల కాళ్ళలో వాపు మొదలవుతుంది. అంతేకాకుండా ఇది తరచుగా శారీరక లేదా మానసిక సమస్యలకు సంకేతం అంటున్నారు నిపుణులు. అలాగే ఈ కాళ్ళలో వాపు మూత్రపిండాల వ్యాధి కారణంగా కూడా ఉంటుందంటున్నారు. కొంతమందిలో ఇది గుండె జబ్బులకు కూడా సంబంధించినది. అందువల్ల మీ పాదాలలో వాపు సమస్య ఉంటే, దానిని నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని వెంటనే సంప్రదించాలంటున్నారు నిపుణులు.


ఆర్థరైటిస్.. పెరుగుతున్న వయస్సుతో ప్రజలు ఆర్థరైటిస్ సమస్యను అభివృద్ధి చేస్తారు. దీని కారణంగా పాదాలలో నొప్పి, వాపు వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. అనారోగ్య సిరలు.. అనారోగ్య సిరలు విస్తరించిన సిరలు. ఇది శరీరంలోని ఏదైనా నరాల పై ప్రభావం చూపుతుంది. కానీ ఇది పాదాలు లేదా కాలి వేళ్లను ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. ఈ సిరలు కాళ్ళలో వాపు, నొప్పిని కలిగిస్తాయి. గుండె సమస్యలు.. నెమ్మదిగా గుండె కొట్టుకోవడం, పనితీరు తగ్గడం వంటి గుండె సమస్యలు గుండె జబ్బులు, కాళ్ళలో వాపునకు దారితీస్తాయి. మూత్రపిండాల వ్యాధి.. కిడ్నీ వ్యాధికి అతి ముఖ్యమైన సంకేతం కాళ్లలో వాపు. సోడియం తగిన మోతాదులో కిడ్నీలకు చేరినప్పుడు కిడ్నీలు సరిగా పనిచేయక కాళ్లు వాచిపోతాయి. కాలేయ వ్యాధి.. కాలేయ వ్యాధి, సిర్రోసిస్ వంటివి శరీరంలో ద్రవం పేరుకుపోవడానికి కారణమవుతాయి. దీని వలన కాళ్ళలో వాపు వస్తుంది.

# వేసవిలో డయాబెటిక్ పేషెంట్లలో షుగర్ లెవెల్ ఎందుకు పెరుగుతుంది ?



వేసవి కాలం మధుమేహ రోగులకు హాని కలిగిస్తుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతతో షుగర్ స్థాయిలు పెరిగే ప్రమాదం కూడా ఉంది. చక్కెర స్థాయి పెరగడం వల్ల కిడ్నీ, కాలేయం, గుండెకు సంబంధించిన అనేక సమస్యలు వస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో వేసవిలో మధుమేహ వ్యాధిగ్రస్తులు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే సాధారణ వ్యక్తుల కంటే డయాబెటిక్ పేషెంట్లు వేడికి ఎక్కువగా గురవుతారు. అలాంటి పరిస్థితిలో మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. దీని గురించి నిపుణుల ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. వైద్యుల ప్రకారం శరీరంలో నీరు లేకపోవడం వల్ల వేసవిలో షుగర్ స్థాయి పెరగడం ప్రారంభమవుతుంది. అధిక ఉష్ణోగ్రత కారణంగా శరీరం ఎక్కువగా చెమట పడుతుంది. ఇది నీటి నష్టానికి దారి తీస్తుంది. అంతే కాదు సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం వల్ల కూడా చక్కెర స్థాయి ప్రభావితమవుతుంది. అటువంటి పరిస్థితిలో ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం కొన్ని ముఖ్యమైన అలవాట్లను పాటించాలి. వేసవిలో మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం. వేసవిలో డైట్ ..పుష్కలంగా నీరు తాగాలి మధుమేహ వ్యాధిగ్రస్తులు వేసవిలో తమను తాము హైడ్రేట్ గా ఉంచుకోవడం చాలా ముఖ్యం. దీంతో షుగర్ లెవెల్ అదుపులో ఉంటుంది. అందువల్ల నీరు ఎక్కువగా తాగాలి. పెరుగు పెరుగు, పెరుగుతో చేసిన వస్తువులను తినండి. ఇది డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. అయితే పెరుగులో పంచదార వేయకూడదని గుర్తుంచుకోండి. సీజనల్ ఫ్రూట్స్ డయాబెటిక్ పేషెంట్లు తమ ఆహారంలో పుచ్చకాయ, బొప్పాయి, మామిడి వంటి సీజనల్ పండ్లను తప్పనిసరిగా చేర్చుకోవాలి. వీటిలో పోషకాలు పుష్కలంగా ఉండటం వల్ల శరీరంలో నీటి కొరత ఏర్పడదు. అయితే వాటిని ఎక్కువ మోతాదులో తీసుకోకూడదు.

# ఈ ఆహార పదార్థాలతో హీట్ స్ట్రోక్ నుంచి తప్పించుకోవచ్చు..




ఢల్లీతో సహా భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 4647 డిగ్రీలకు చేరుకుంది. ఇలాంటి సమయంలో శరీరం చల్లగా హైడ్రేటెడ్ గా ఉండాలంటే ఆహారం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. %జణజ% ప్రకారం ఒకరు హీట్ స్ట్రోక్‌కు గురైనప్పుడు, శరీర ఉష్ణోగ్రత వేగంగా పెరుగుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఎలక్ట్రోలైట్స్, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాన్ని తినడం శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుంది. వేసవిలో కొన్ని ఆహారపదార్థాలు తినడం ద్వారా శరీర ఉష్ణోగ్రతను అదుపులో ఉంచుకోవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. పెరుగు, పుచ్చకాయ వంటి అనేక ఆహార పదార్థాలు మంచి హైడ్రేషన్ స్థాయిని కలిగి ఉంటాయి. అంతే కాదు వీటిలో పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. పుచ్చకాయ..పిల్లల నుండి పెద్దల వరకు అందరికీ ఇష్టమైన పుచ్చకాయలో 90% కంటే ఎక్కువ నీరు ఉంటుంది. శరీరంలో నీటి స్థాయిని పెంచేందుకు దీన్ని తినవచ్చు. పుచ్చకాయలో పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉన్నాయి. సహజంగా తీపి పుచ్చకాయ వేసవిలో మనల్ని ఎనర్జిటిక్‌గా ఉంచుతుంది. పుచ్చకాయను కోసి తినడమే కాకుండా, మీరు దాని నుండి రిఫ్రెష్ డ్రిరక్ కూడా తయారు చేసుకోవచ్చు. అలాగే నిమ్మ, పుదీనా వంటి కూలింగ్ ఏజెంట్లను డ్రిరక్‌లో చేర్చి ఆరోగ్యంగా ఉండండి.

దోసకాయ.. సాధారణంగా సలాడ్‌లో తినే దోసకాయలో 95 శాతం నీరు ఉంటుంది. హైడ్రేటింగ్ లక్షణాలతో పాటు, ఇందులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ల మేటరీ లక్షణాలు కూడా ఉన్నాయి. అందువల్ల, దీన్ని తినడం ద్వారా మీరు అనేక ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇందులో విటమిన్ సి ఉంటుంది. ఇది మన రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది. దోసకాయ సలాడ్ కాకుండా, మీరు దాని రైటా, శాండ్‌విచ్, డిటాక్స్ వాటర్ కూడా తాగవచ్చు. కొబ్బరి నీరు.. ఎలక్ట్రోలైట్స్ ఉత్తమ మూలం, కొబ్బరి నీరు పొటాషియం, సోడియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు, పోషకాల లోపాన్ని తీరుస్తుంది. ఇది తక్కువ కేలరీలను కలిగి ఉంటుంది. ఈ వేసవిలో తాగడం వల్ల మీరు డీహైడ్రేషన్‌ను నివారించడమే కాకుండా మీ చర్మం మెరుస్తుంది. కొబ్బరినీళ్లు తాగడమే కాకుండా అందులో విత్తనాలను నానబెట్టి స్మూతీని తినవచ్చు.

పుల్లని పండ్లు.. వేసవిలో రోగ నిరోధక శక్తిని పటిష్టంగా ఉంచుకోవాలంటే విటమిన్ సి సరైన మోతాదులో తీసుకోవాలి. కివి, నిమ్మ వంటి సిట్రస్ పండ్లు వంటివి. ఇవి శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడమే కాకుండా యాంటీ ఆక్సిడెంట్‌లను కలిగి ఉన్నందున వ్యాధుల వచ్చే ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. కివీని నేరుగా తినడమే కాకుండా, దాని రసం కూడా తాగవచ్చు. అంతే కాదు లెమన్ వాటర్ వేసవిలో బెస్ట్ డ్రిరక్. పెరుగు.. ప్రోటీన్, ప్రోబయోటిక్స్, కాల్షియం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలకు మూలం పెరుగు. మన జీర్ణవ్యవస్థను బలంగా ఉంచడానికి ఇది పనిచేస్తుంది. వేసవిలో మీ జీర్ణక్రియ సరిగ్గా ఉంటే, మీకు వ్యాధుల ప్రమాదం తక్కువగా ఉంటుంది. లంచ్‌లో తప్పనిసరిగా ఒక గిన్నె పెరుగు తినాలని డైటీషియన్లు చెబుతున్నారు. పుదీనా.. పొట్టకు చల్లదనాన్ని ఇచ్చే పుదీనాలో అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. దీని స్వభావం చల్లగా ఉంటుంది కాబట్టి దీన్ని కడుపునకు వరం అని భావిస్తారు. పొట్టలోని వేడిని శాంతపరిచే పుదీనా మన జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. మీరు పుదీనా పానీయం, దాని సలాడ్, పిప్పరమింట్ టీ, ఇతర వస్తువులను కూడా తయారు చేసి తినవచ్చు.పచ్చని ఆకుకూరలు.. కూరగాయలు మన ఆరోగ్యానికి దివ్యౌషధంలా పనిచేస్తాయి. వీటిలో విటమిన్ ఎ, సి, ఐరన్, కాల్షియం వంటి పోషకాలు, విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది తక్కువ కేలరీల ఆహారం, శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో ఇది సహాయపడుతుంది. బచ్చలికూర, ఇతర ఆకుకూరలు తినడం ద్వారా వేసవి కాలంలో ఆరోగ్యంగా ఉండవచ్చు.

# స్మార్ట్ ఫోన్ పక్కన లేకపోతే నిద్ర పట్టడం లేదా?



ప్రస్తుతం ఫోన్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయింది. బంధాలు, బంధుత్వాలు వదులుకోవడానికైనా సిద్ధపడుతున్నారు కానీ, స్మార్ట్ ఫోన్ వాడటం మాత్రం ఆపేయడం లేదు.అంతలా ఫోన్‌కు అడెక్ట్ అయిపోయారు. ఉదయం లేచిదంటే, నైట్ పడుకునే వరకు చేతిలో ఫోన్. వీరు వారు అనే తేడా లేకుండా.. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఇదే దారిలో వెళ్తున్నారు. స్మార్ట్ ఫోన్‌ను అతిగా యూస్ చేయకూడదు, ఆరోగ్యానికి అది మంచిది కాదు అని ఎంత మంది ఎన్ని చెప్పినా వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా రాత్రి పడుకునే సమయంలో కూడా దానిని తలకు దగ్గరగా లేదా, పక్కనే పెట్టుకొని పడుకుంటున్నారు. అయితే ఇది ఆరోగ్యానికి చాలా హానికరం అంటున్నారు నిపుణులు. స్మార్ట్ ఫోన్ పక్కలోనే పెట్టుకొని పడుకోవడం వలన అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే అవకాశం ఉన్నదంటున్నారు. కాగా, ఆ సమస్యలు ఏంటో ఇప్పుడు చూద్దాం. స్మార్ట్ ఫఓన్ నుంచి వచ్చే నీలి కాంతి అనేది మెలటోనిన్ అనే హార్మోన ఉత్పత్తిని తగ్గిస్తుంది. దీని వలన నిద్రలేమి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అంతే కాకుండా మొబైల్ రేడియో ఫ్రీక్వెన్సీ రేడియేషన్‌ను విడుదల చేస్తుంది. ఇది క్యాన్సర్ కారకమని, దీని వలన చాలా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. అందువలన నైట్ టైమ్‌లో మొబైల్ ఫోన్‌కు చాలా దూరంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తుంది. అంతే కాకుండా స్మార్ట్ ఫోన్ పక్కనే పెట్టుకొని పడుకోవడం వలన నరాల బలహీనత. నడుము నొప్పి, మెడ నొప్పి, క్యాన్సర్, చెవుడు, మెదడులో రేడియేషన్ వలన ప్రాణాంతకమైన గ్లియోమో అనే కణితులు ఏర్పడటం ఇది మెదడు క్యాన్సర్‌కు దారితీయడం లాంటిది జరుగుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందువలన సాధ్యమైనంత వరకు స్మార్ట్ ఫోన్‌కు చాలా దూరంగా ఉండాలని వారు చెబుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



పేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్న "మాస్" సంస్థ సభ్యులు



పేద విద్యార్థిని వైద్య విద్యకు ఆర్థిక సహాయం అందిస్తున్న" మాస్" ప్రతినిధులు

# మాదిగ పేద విద్యార్థులకు అండగా మాస్

## మానవతా సేవలో మహా ఆది సేవ సమితి

**వరంగల్,అక్టోబర్25(తెలంగాణ ముచ్చట్లు):**

సమాజంలో వెనుకబడిన వర్గాలకు చేయూతనిస్తూ, విద్యార్థుల భవిష్యత్తు వెలుగులు రగిలించాలనే లక్ష్యంతో మాదిగ కులానికి చెందిన కొందరు ఉద్యోగులు, ప్రముఖులు కలిసి ఏర్పరచిన సంస్థ మహా ఆది సేవ సమితి (మాస్) ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సంస్థ ప్రధాన ఉద్దేశ్యం - ఉన్నత విద్య కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాదిగ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం. ప్రతీ నెలా సభ్యులు తమకు తోచినంతగా రూ.200 నుంచి రూ.1000 వరకు విరాళాలు అందజేస్తున్నారు. ఈ విరాళాలు సంస్థ పేరుతో ఉన్న ఖాతాలో జమ చేయబడతాయి. ఆ తర్వాత ఆర్థిక అవసరంలో ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి సహాయం అందజేస్తున్నారు. సహాయం కోరిన విద్యార్థి వివరాలను సంస్థ ప్రతినిధులు స్వయంగా వెళ్లి పరిశీలిస్తారు. అభ్యర్థి నిజమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని నిర్ధారించిన తర్వాతే సహాయం అందుతుంది. రెండు రోజుల వ్యవధిలోనే సభ్యులు ప్రత్యక్షంగా వెళ్లి విద్యార్థికి చేయూత అందించడం ఈ సంస్థ ప్రత్యేకతగా నిలుస్తోంది.

మాస్‌లోని సభ్యులందరూ మాదిగ కులానికి చెందినవారే కావడం విశేషం. వారిలో చాలా మంది ఉద్యోగులు, సేవా కార్యక్రమాల్లో ముందుండే ప్రముఖులు కావడం ఈ సేవా కార్యక్రమానికి మరింత విశ్వసనీయతను తెచ్చిపెట్టింది. కులానికే పరిమితం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేస్తున్న ఈ సంస్థ చర్యలు ప్రశంసనీయమైనవిగా మారాయి. మాదిగ కులం నుంచి సమాజాభివృద్ధికి విద్యార్థుల రూపంలో వెలుగులు పంచే ప్రయత్నం చేస్తున్న ఈ 'మాస్' సంస్థ నిజమైన మానవతా సేవకు ప్రతీకగా నిలుస్తోంది.

**"పే బ్యాక్ టూ ద సొసైటీ" నినాదంతో ముందుకు**

వరంగల్,ఖమ్మం జిల్లాల్లో ప్రారంభమైన మహా ఆది సేవ సమితి (మాస్) కార్యక్రమాలు నెమ్మదిగా రాష్ట్రమంతా వ్యాప్తి చెందుతున్నాయి. మాదిగ కులానికి చెందిన విద్యార్థుల భవిష్యత్తు కోసం సేవలందిస్తున్న మాస్ సభ్యులు ఈ అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.మాదిగ కులంలో పుట్టి మంచి స్థాయిలో ఉన్న వ్యక్తులు ముందుకు వచ్చి మన జాతి బిడ్డలకు అండగా ఉండాలి అని వారు పిలుపునిస్తున్నారు. 'పే బ్యాక్ టూ ద సొసైటీ' నినాదంతో మాస్ సంస్థ సమాజానికి సేవ చేయడంలో ముందుకు సాగుతూ, నిజమైన ఆర్థిక అవసరంలో ఉన్న విద్యార్థులకు సహాయం అందించడం ద్వారా సామాజిక బాధ్యతను నెరవేరిస్తోంది.

**మన జాతి బిడ్డలను ఆదుకునేందుకు ముందుకు రావాలి**

**మన జాతి బిడ్డలను ఆదుకునేందుకు మాదిగ జాతి ఉద్యోగస్తులు, ఉన్నత స్థాయిలో స్థిరపడ్డవారు ముందుకు రావాలి. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు చిన్నదైనా సహాయం అందించాలి. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న మాదిగ జాతి విద్యార్థులు, మీరు ఆర్థిక సహాయం కోసం ఈ నంబర్లలో 9010730380,8520992269 సంప్రదించవచ్చు. మాస్ సంస్థ మీ సమస్యలను స్వయంగా పరిశీలించి, నిజమైన అవసరం ఉన్న విద్యార్థులకు త్వరితంగా సహాయం అందిస్తుంది. మాస్ ప్రతి ఒక్కరు మీ కోసం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది, మీ భవిష్యత్తుకు వెలుగు నింపేందుకు ముందుకు సాగుతోంది."**

**- మాస్ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ విజయ్ కుమార్**

# ఆర్మీ శక్తి ప్రదర్శన అద్భుతం: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ శుక్రవారం రోజున భారత సైన్యం నిర్వహించిన 'సామర్థ్య ప్రదర్శన విన్యాసాల'ను తిలకించారు. సరికొత్త ఆయుధ సంపత్తి, సాంకేతికతతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన సైనిక విభాగాలు ప్రదర్శించిన శక్తిని చూసి ఆయన ప్రశంసించారు. ఈ విన్యాసాల్లో భారత సైన్యంలోకి కొత్తగా చేర్చిన 'భైరవ్ బెటాలియన్' మరియు 'అశ్ని ప్లాటూన్' వంటి సంస్థలతో పాటు, ఆధునిక ఆపరేషన్ల నిర్వహణకు సైన్యంలోకి తీసుకువచ్చిన అత్యాధునిక సాంకేతిక ఆస్తుల సమీకృత వినియోగాన్ని సైనికులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శన అత్యంత శక్తివంతంగా, సమర్థవంతంగా ఉందని రాజ్ నాథ్ సింగ్ ట్విట్టర్ వేదికగా తెలిపారు.

సైన్యం ఆధునికీకరణపై దృష్టి

ఈ ప్రదర్శన పాత) మరియు కొత్త యొక్క సజావుగా సమ్మిళితాన్ని సూచిస్తుందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. భారత సైన్యం సామర్థ్య అభివృద్ధి మరియు సైనిక ఆధునికీకరణ పై ఎంతగా దృష్టి సారించిందో ఈ ప్రదర్శన హైలైట్ చేసిందని రాజ్ నాథ్ సింగ్ కొనియాడారు. భారత సైన్యం యొక్క శక్తి మరియు సంసిద్ధతను ఈ విన్యాసాలు ప్రతిబింబించాయని ఆయన అన్నారు.

# మహిళా వైద్యురాలి ఆత్మహత్య కేసు

**సూసైడ్ నోట్‌లో పేర్లు రాసిన వ్యక్తి అరెస్ట్**
**వేధింపులు తట్టుకోలేక బలవన్మరణం**

మహారాష్ట్రలోని సతారా జిల్లాలో 28 ఏళ్ల మహిళా వైద్యురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటనలో పోలీసులు తాజాగా ఒకరిని అరెస్ట్ చేశారు. సూసైడ్ నోట్‌లో ఆమె పేర్కొన్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరైన ప్రశాంత్ బంకర్‌ను ఫల్తాన్ పోలీసులు శనివారం పూణేలో అదుపులోకి తీసుకున్నారు. ఫల్తాన్ ఉపజిల్లా ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బాధితురాలు గురువారం రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆమె తన చేతిపై రాసిన సూసైడ్ నోట్‌లో, ఒక ఎస్ఐ నిత్యం పెడుతున్న వేధింపులు తట్టుకోలేకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా, మరో పోలీసు అధికారి అయిన ప్రశాంత్ బంకర్ కూడా తనను మానసికంగా వేధించినట్లు ఆమె తన నోట్‌లో ఆరోపించారు. ఈ వేధింపులకు కారణమైనట్లుగా భావిస్తున్న సబ్ డివిజనల్ పోలీసు ఇన్‌స్పెక్టర్ పాటిల్ మరియు పోలీసు ఇన్‌స్పెక్టర్ లాడ్‌పుత్రే పేర్లను కూడా ఆమె ఆత్మహత్య నోట్‌లో ప్రస్తావించారు. ఈ ఆత్మహత్య ఘటన రాష్ట్రంలో రాజకీయ వివాదాన్ని సృష్టించింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, సూసైడ్ నోట్ ఆధారంగా నిందితులపై చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే ప్రశాంత్ బంకర్‌ను అరెస్ట్ చేశారు.

# ఒక్క జిల్లాలోనే 222 టన్నుల బంగారం..

- రాజస్థాన్‌లో బయటపడ్డ కొత్త గనులు!
- 222 టన్నుల స్వచ్ఛమైన బంగారం లభించే అవకాశం
- మైనింగ్ లైసెన్స్‌ల టెండర్ ప్రక్రియ



దేశంలో అత్యధిక ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల్లో ఒకటైన రాజస్థాన్, ఇప్పుడు భారీ బంగారు నిల్వల విషయంలో మరోసారి వార్తల్లో నిలిచింది. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతమైన బన్స్‌వారా జిల్లాలో భారీగా బంగారు నిక్షేపాలు ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ఆవిష్కరణతో బన్స్‌వారా.. దేశానికి కొత్త స్వర్ణ రాజధానిగా మారే అవకాశం ఉంది. జిల్లాలోని ఘటోల్ తెహసీల్ పరిధిలోని కంకారియా గ్రామంలో ఈ కొత్త నిల్వలను గుర్తించారు. ఇప్పటికే ఇక్కడ ఉన్న భుకియా, జగ్‌పురా గనుల తర్వాత ఇది మూడో అతి పెద్ద బంగారు గనిగా నిలవనుంది. భూగర్భ శాస్త్రవేత్తలు జరిపిన సర్వేల ప్రకారం, కంకారియా ప్రాంతంలో దాదాపు 3 కిలోమీటర్ల మేర బంగారు ఖనిజం విస్తరించి ఉన్నట్లు బలమైన ఆధారాలు లభించాయి. ఈ ప్రాంతంలో మొత్తం 940.26 హెక్టార్ల విస్తీర్ణంలో 113.52 మిలియన్ టన్నుల బంగారు ఖనిజం ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఖనిజాన్ని శుద్ధి చేసిన తర్వాత సుమారు 222.39 టన్నుల స్వచ్ఛమైన బంగారం లభించవచ్చని నిపుణులు చెబుతున్నారు. రాజస్థాన్‌లో ఇప్పటివరకు వెలుగుచూసిన అతిపెద్ద బంగారు నిల్వల్లో ఇది కూడా ఒకటి కావడం గమనార్హం.

బంగారంతో పాటు ఇతర ఖనిజాలు, వాణిజ్య ప్రాధాన్యత

కంకారియాగారా ప్రాంతంలో బంగారంతో పాటు రాగి, నికెల్, కోబాల్ట్ వంటి ఇతర విలువైన ఖనిజాలు కూడా లభించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అన్ని అనుమతులు లభించి, మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమైతే, భారతదేశంలో బంగారం తవ్వకాలు జరిపే అతికొద్ది రాష్ట్రాల జాబితాలో రాజస్థాన్ కూడా చేరుతుంది. అంతేకాకుండా, భవిష్యత్తులో దేశం మొత్తం బంగారం డిమాండ్‌లో 25 శాతం వరకు ఒక్క బన్స్‌వారా జిల్లా నుంచే సరఫరా చేసే సామర్థ్యం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

గతంలో భుకియాజగ్‌పురా మైనింగ్ బ్లాక్‌ల వేలంలో గెలిచిన సంస్థ అవసరమైన హామీ మొత్తాన్ని జమ చేయడంలో విఫలం కావడంతో ప్రభుత్వం ఆ లైసెన్స్‌ను రద్దు చేసింది. ప్రస్తుతం ఈ బ్లాక్‌ల కోసం మళ్లీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా, నవంబర్ 3న బిడ్లను తెరవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక రెవెన్యూ వాటాను చెల్లించే సంస్థకు మైనింగ్ లైసెన్సును కేటాయించనున్నారు.

# లాలూ, రబ్రీ సర్కార్ వస్తే మళ్లీ 'జంగిల్‌రాజ్' తప్పదు: అమిత్ షా

**అభివృద్ధి పాలన కావాలా, ఆటవిక పాలన కావాలా?**




బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీనియర్ బీజేపీ నాయకుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన ప్రసంగాల జోరును పెంచారు. శనివారం ఖగారియాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన షా, ప్రతిపక్ష కూటమిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రతిపక్ష మహాఘట్బంధన్‌కు ఓటువేస్తే మళ్లీ ఆటవిక పాలనను (జంగిల్‌రాజ్‌ను) కొనితెచ్చుకున్నట్లేనని ఓటర్లను ఆయన గట్టిగా హెచ్చరించారు. ఎన్డీయే సర్కార్ బీహార్‌ను అభివృద్ధి పథంలో నడిపించిందని అమిత్ షా అన్నారు. మళ్లీ అధికార కూటమినే గెలిపించాలని కోరారు. "రాష్ట్రంలో ఆటవిక పాలన కావాలో, అభివృద్ధి పాలన కావాలో మీరే తేల్చుకోవాలి" అని ఆయన ప్రజలనుద్దేశించి అన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిల సర్కారు మళ్లీ వచ్చిందంటే, దాంతో పాటు జంగిల్‌రాజ్ కూడా వస్తుందని షా వ్యాఖ్యానించారు. ఎన్డీయేని గెలిపిస్తే అభివృద్ధి చెందిన బీహార్‌ను చూస్తారని చెప్పారు. ఎన్డీయే కూటమి ఐదుగురు పాండవులతో కూడిన కూటమి అని, ఈ కూటమిని గెలిపిస్తే రాష్ట్రంలో అన్నీ విజయాలేనని అమిత్ షా అన్నారు. మరోవైపు, మహాఘట్బంధన్ మరియు 'లత్బంధన్' (లాఠీల కూటమి)లు రికార్డు స్థాయిలో అవినీతికి పాల్పడ్డాయని షా ఆరోపించారు. "వాళ్లు బీహార్‌ను అభివృద్ధి చేస్తారా..?" అని ప్రశ్నించారు. నయాపైసా కూడా అవినీతికి పాల్పడని నరేంద్ర మోదీ, నితీశ్ కుమార్‌లతోనే బీహార్ అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in